ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5
బాపట్ల జిల్లా వార్తలు
గురువారం 28 నవంబరు 2024


చీరాల : ఏరియా వైద్యశాలలో ఫిట్స్‌తో బాధపడుతున్న బాలుడికి చికిత్స చేస్తున్న సిబ్బంది

వైద్య చికిత్సలో నర్సుల పాత్ర ఎంతో కీలకం. చికిత్సలకు ముందు రోగులు, బాధితులకు సేవలు అందించేది నర్సులు. ఇంజక్షన్ల నుంచి గాయాలకు కట్లు కట్టడంతో పాటు శస్త్రచికిత్సల్లో వైద్యులకు సహాయకారిగా ఉండేది నర్సులే. ఇలాంటి నర్సులు కొరత ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెలకొంది. వివిధ విభాగాల్లో ఇతర సిబ్బంది.. పరికరాలు.. అన్నీ ఉన్నా నర్సులు లేకపోవడంతో రోగులకు సరైన చికిత్సలు సక్రమంగా అందడంలేదు. ప్రధానంగా గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని ఏరియా ఆస్పత్రుల్లో కూడా నర్సుల కొరత వెంటాడుతోంది. ఆయా ఆస్పత్రుల్లో నర్సింగ్ చదివే విద్యార్థులతో సరిపెడుతున్నారే కాని నర్సింగ్ సిబ్బంది నియామకంపై అధికారులు దృష్టి సారించడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. పగలు నర్సింగ్ విద్యార్థులు ఉన్నా రాత్రి వేళల్లో నర్సులు కొరతతో రోగులు ఇక్కట్లు పడుతున్నారు. నర్సుల పోస్టులు భర్తీ చేయాలని లేఖలు రాస్తున్నా వైద్య ఆరోగ్య శాఖ స్పందించడంలేదన్న విమర్శలున్నాయి. ఇక పెరుగుతున్న ఓపీలకు, రోగులకు అనుగుణంగా వసతులు, సౌకర్యాల కల్పనలోనూ ప్రభుత్వం పట్టీపట్టనట్లుగా ఉంటుందన్న ఆరోపణలున్నాయి. కొన్ని ఆస్పత్రులతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు కూడా అన్ని విభాగాల్లో లేరని సమాచారం.

- విద్యార్థులతో నెట్టుకొస్తున్నారు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో నర్సుల కొరత
- వైద్య పరికరాల లేమి.. సిబ్బందీ అరకొరే
- ఓపీలకు అనుగుణంగా పెరిగిన వసతులు
- సకాలంలో చికిత్సలు అందక ప్రాణాలు హరీ



రేపల్లె : ప్రభుత్వ వైద్యశాలలో పనిచెయ్యని ప్రాణవాయువు ఉత్పత్తికేంద్రం

నర్సింగ్.. నై

బాపట్ల : ఏరియా వైద్యశాలలోని మహిళా వార్డులో రోగులు




(ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్)

పేరుకు అవి పెద్దాస్పత్రులే. ఇక్కడ నర్సులు ఉండరు.. వైద్యులు ఉండరు.. పరికరాలు, సౌకర్యాలు, మందులూ అంతంతే. ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడీని తట్టుకోలేక పేద, మధ్య తరగతి వర్గాలు ఎక్కువగా ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో గత కొంతకాలంగా ఓపీ రోగులు విపరీతంగా పెరిగిపోతున్నారు. అయితే రోగుల సంఖ్యకు అనుగుణంగా చాలా ఆస్పత్రుల్లో నర్సుల నియామకాలు జరగడం లేదు. పెరుగుతున్న జనాభా అవసరాలకు తగినట్లుగా ఏరియా వైద్యశాలల్లో సౌకర్యాల కల్పనపై గత ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. దీంతో ఇప్పుడు ఆస్పత్రుల్లో రోగులకు కష్టాలు రెట్టింపయ్యాయి. నిరుపేదలకు మెరుగైన వైద్యం అందడం గగనంగా మారింది. రెండేళ్ల క్రితం వరకు ఏరియా ఆసుపత్రుల్లో 200 వరకు మాత్రమే ఉండే ఓపీల సంఖ్య ప్రస్తుతం అది 400 వరకు చేరుకుంది. కానీ అరకొరగా అవే వైద్య పరికరాలు, చాలీచాలని సిబ్బందితోనే ఇప్పుడు కూడా వైద్యం అందిస్తున్నారు. దీంతో ప్రాంతీయ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందని ద్రాక్షగానే మిగులుతోంది. పల్నాడు, బాపట్ల జిల్లాలుగా ఆవిర్భవించి రెండున్నరేళ్లు దాటినా జిల్లా ఆస్పత్రుల ఏర్పాటు ఊసే మరిచారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఆరు నెలలు గడచినా ఏరియా ఆస్పత్రులలో వసతుల కల్పనతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఖాళీల భర్తీపై నిర్మాణాత్మక ప్రకటన ఇప్ప టికీ విడుదలకాలేదు. ఆస్పత్రుల నిర్వహణపై పాలకులకు చిత్తశుద్ధి కొరవ డిందన్న విమర్శలున్నాయి. మొక్కుబడిగా ప్రభుత్వాస్పత్రుల ను నిర్వహిస్తున్నట్లుగా ఇక్కడ నె లకొన్న పరిస్థితులు తెలియజేస్తున్నాయి.

- బాపట్ల ఏరియా ఆస్పత్రిలో 100 పడకలకు 120కి మందికి సర్దాల్సి వస్తుంది. 23 మంది వైద్యులకు 20 మంది మాత్రమే ఉన్నారు. స్టాఫ్ నర్సులు 24 మందికి 14 మంది మాత్రమే ఉన్నారు. నర్సింగ్ విద్యార్థులు 15మందిని తీసుకున్నారు. విభాగాల వారీగా వైద్యం అందించే స్పెషలిస్టు వైద్యులే లేరు. నర్సింగ్ సూపరింటెండెంట్ పోస్ట్ ఒకటి, హెడ్‌నర్సుపోస్టులు నలుగురు ఉండాల్సి ఉండగా ఇక్కడ ఇద్దరు డిప్యూటేషన్‌పై వేమూరు, తెనాలి వెళ్లారు. వెంటిలేటర్ ఉన్నా వైద్యులు లేరు. ఐసీయూ ఉన్నా ఫిజీషియన్ వైద్యుడు ఒక్కరే ఉండడంతో సేవలు అరకొరగానే అందుతున్నాయి. సీటీ, ఎంఆర్ఐ సౌకర్యాలు అందుబాటులో లేవు. అంబులెన్స్‌లేదు. మార్చురీలో రెండే ఫ్రీజర్లు ఉండడంతో మూడో మృతదేహం వస్తే దానిని బయటే ఉంచుతున్నారు.
- చీరాల ఏరియా వైద్యశాల 100 పడకల ఆసుపత్రి కాగా 12 మంది భద్రతా సిబ్బంది. 23 మంది పారిశుధ్య సిబ్బంది మాత్రమే ఉన్నారు. వైద్యశాలలో ప్రధానంగా ఎముకలు, కీళ్లు, ఆర్ఎంవో, సీఎస్ఎస్ జనరల్ సర్జన్, కంటి వైద్యనిపుణులు, చెవి, ముక్కు, గొంతు విభాగాలకు సంబంధించి వైద్యుల కొరత ఉంది. ఆస్పత్రిలో 22 వెంటిలేటర్లు, 50కి పైగా ఆక్సిజన్ కాన్‌సన్‌ట్రేటర్లు ఉన్నాయి. కొవిడ్ నేపథ్యంలో వీటిని ఏర్పాటు చేయగా వాటిలో కొన్ని పనిచేస్తుండగా, మిగిలిన వాటిని పరీక్షించాల్సిన అవసరం ఉంది. పరిసరాల్లో పారిశుధ్యం మెరుగుపడాల్సిన అవసరంతో పాటు ఇతర సిబ్బంది భర్తీ విషయంలో వేగం చూపాల్సి ఉంది.
- రేపల్లె ప్రాంతీయ ఆస్పత్రి సమస్యలకు నిలయంగా ఉంది. ఇక్కడ సిబ్బంది కొరత పట్టిపీడిస్తోంది. హెడ్ నర్సుల పోస్టులతో పాటు నర్సుల ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది. సేవలందిస్తున్న వైద్యుల్లో ఎక్కువ మంది డిప్యూటేషన్‌పై ఉన్నవారే. అత్యవసర వైద్యం కోసం రోగులు గుంటూరు కానీ తెనాలి బాటే పట్టాల్సి వస్తోంది. ప్రైవేటు అంబులెన్స్‌ల్లోనే రోగులను తరలించాల్సి రావడంతో నిరుపేదలకు అది భారంగా తయారైంది. జనరేటర్‌లో డీజిల్‌కు కూడా నిధులు మంజూరు లేక పోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన ప్రతిసారి రోగులు చీకట్లోనే మగ్గాల్సి వస్తుంది.
- రేపల్లెలోని ప్రభుత్వ వైద్యశాలలో ఎనిమిదినెలలుగా ప్రాణవాయువు ఉత్పత్తికేంద్రం పనిచేయడంలేదు. అధికారుల దృష్టికి తీసుకుని వెళ్ళిన పట్టించుకోలేదు. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి ఆక్సిజన్ ప్లాంట్ నిరుపయోగంగా మారింది. వైద్యశాలలో రోగులకు తగ్గ మందులు అందుబాటులో లేవు. ఉన్న మందులతోనే సరిపెడుతున్నారే తప్పా లేనిమందులను బయట షాపుల్లో కొనుక్కోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

40 వరకు మరణాలు..

సకాలంలో వైద్యం అందకనే గడచిన మూడేళ్లలో బాపట్ల జిల్లా పరిధిలోని ఏరియా ఆస్పత్రుల్లో 40 మంది వరకు చనిపోయినట్లు గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. వైద్య పరికరాలు అందుబాటులో లేకపోవడం తోడు నిపుణులైన వైద్యులు అందుబాటులో లేకపోవడం కూడా పరోక్షంగా వీరి మృతికి కారణంగా ఉంది. రాత్రి పూట ఏరియా ఆస్పత్రులకు వచ్చే రోగుల విషయంలో సిబ్బంది నుంచి కనీస స్పందన కరువవుతుందన్న విమర్శలున్నాయి. విధుల్లో ఉండాల్సిన డాక్టర్లు అందుబాటులో లేకుండా నర్సులతోనే నడిపిస్తున్నారన్న విమర్శ ఉంది. రాత్రి వేళ్లలో అత్యవసర వైద్యం కోసం వచ్చే వారిలో 90 శాతం మందిని గుంటూరుకో, ఒంగోలుకో పంపుతున్నారు తప్ప చికిత్సలు అందిస్తున్న పాపాన పోవడం లేదు. మెరుగైన వైద్యం కోసం తరలించే లోపులోనే ఎక్కువ శాతం మంది ప్రాణాలు విడుస్తున్నారు. ఏడాదిన్నర క్రితం ప్రశ్నపత్రాల మూల్యాంకనానికి వచ్చిన ఓ ఉపాధ్యాయుడు బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో కుప్పకూలితే ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వెంటనే గుంటూరుకు రిఫర్ చేయగా మార్గమధ్యలోనే ఆయన తుది శ్వాస విడిచారు. సకాలంలో వైద్యం అంది ఉంటే ఆయన ప్రాణాలు నిలబడేవని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు. ఏరియా ఆసుపత్రులను వెంటాడుతున్న బాలారిష్టాల వల్ల గోల్డెన్ అవర్‌లో అందాల్సిన వైద్యం అందడం లేదు.



రిజిస్ట్రేషన్లకు గండం

- రైతుల ప్లాట్లకు సీఆర్డీఏ మోకాలడ్డు
- సమీకరణ భూముల్లో అసైన్డ్ ఉంటే అంతే సంగతి
- అధికారుల తీరుపై రాజధాని రైతుల ఆగ్రహం
- నాట్ ట్యాలీడ్ పేరుతో కౌలు ఎగవేతపైనా ఆవేదన

(గుంటూరు- ఆంధ్రజ్యోతి)

ఇలా ఒకరు, ఇద్దరు కాదు నీరుకొండ, కురగల్లు గ్రామాల్లోనే 600 మంది ప్లాట్లు రిజిస్ట్రేషన్‌ను అధికారులు ఆపేశారు. ఇలా రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో వందలాది మంది రైతుల రిటర్నబుల్ ప్లాట్లను సీఆర్డీఏ అధికారులు రిజిస్ట్రేషన్ చేకుండా నిలిపివేశారు. 2015లో భూసమీకరణ పథకం కింద భూములిచ్చిన రైతులకు అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏటా కౌలు చెల్లించడంతోపాటు రైతులకు గృహ సముదాయం, వాణిజ్య సముదాయం కింద రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించింది. 2019 ఎన్నికలకు ముందు వరకూ ఆ ప్రభుత్వం వారి ప్లాట్లను రిజిస్టర్ చేసింది. అయితే ఎన్నికల నాటికి ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ను పూర్తిగా పక్కనపెట్టింది. గడిచిన ఐదేళ్లు రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. కిందటి ఎన్నికలకు ఏడాది ముందు వైసీపీ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల పేర హడావుడి చేసినా రైతులు మాత్రం ముందుకు రాలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రైతులు తమ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ముందుకు వస్తున్నారు. అయితే సీఆర్డీఏ అధికారులు

(మిగతా 6వ పేజీలో..)

- నీరుకొండకు చెందిన జొన్నలగడ్డ విష్ణువర్ధనరావు ఆరున్నర ఎకరాల పట్టాభూమి, 70 సెంట్లు పొరెస్టు భూమిని ల్యాండ్ భూ సమీకరణ కింద ఇచ్చారు. అతడికి ఫుల్ ప్యాకేజీ ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే అతడి రిటర్నబుల్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకుండా అధికారులు అడ్డుకుంటున్నారు. రెండు నెలల నుంచి సీఆర్డీఏ కార్యాలయం చుట్టూ తిరిగి ఆయన విసిగి వేసారిపోయారు.

- కురగల్లుకు చెందిన మాదల సుజాత అనే మహిళా రైతు ఐదు ఎకరాలు పట్టాభూమి, అర ఎకరం పొరెస్టు భూమిని భూ సమీకరణ కింద ఇచ్చారు. ఆమెకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయడానికి సీఆర్డీఏ అధికారులు ఆపుతున్నారు. ఆ రైతులు ఇచ్చిన పట్టా భూముల తాలూకు రిటర్నబుల్ ప్లాట్లను కూడా సీఆర్డీఏ అధికారులు రిజిస్ట్రేషన్ చేయడం లేదు.

7న మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్

- ముఖ్యమంత్రి పర్యటనను జయప్రదం చేయాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ జె.వెంకటమురళి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 7న బాపట్లలో జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను గొప్పగా నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరవుతున్నందున ఏర్పాట్లలో ఎలాంటి రాజీ ఉండకూడదని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనపై జిల్లా అధికారులతో బుధవారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో కలెక్టర్ సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు. బాపట్ల పాఠశాలలో చదివి ఉన్నత స్థాయికి ఎదిగిన పూర్వ విద్యార్థులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించాలన్నారు. విద్యార్థుల తల్లులతో నిర్వహించే ముగ్గుల పోటీలు మహిళా శిశుసంరక్షణ పీడీ కె.ఉమా పర్యవేక్షించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి పోటీలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్ట్ కమిటీ కోఆర్డినేటర్‌గా ఇంటర్మీడియట్‌బోర్డు ఆర్ఐవో పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, డీఈవో ఎస్.పురుషోత్తం, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, సాంఘిక సంక్షేమశాఖ డీడీ రాజాదెబోరా, ఉద్యానశాఖాధికారి జెన్నెమ్మ, డీపీవో ప్రభాకరరావు, ఫోరంఫర్‌బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

మినీ మహాభారతం.. పల్నాటి యుద్ధం

- పోతుగడ్డలో పారిన వీరుల రక్తం
- యుద్ధభూమిలో ఆయుధ పూజ
- 30 నుంచి వీరారాధనోత్సవాలు

8

దారి దోపిడీ దొంగలకు ఐదేళ్ల జైలు, జరిమానా

నేటి వరకే క్లెయిమ్‌లు.. అభ్యంతరాల స్వీకారం

అడుగడుగునా వసూళ్ళు

- మిర్చి ఎగుమతిదారుల పక్కచూపులు
- గుంటూరు యార్డులో సిండికేట్‌లతో వేగలేకే ప్రత్యామ్నాయం


కొల్లూరు : అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి మనోహర్

6

ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

8

బీచ్‌వాలీబాల్ పోటీల్లో.. గుంటూరు జిల్లా ప్రతిభ

గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య సమస్యలు పరిష్కరించడంతో, ఎస్సీ యువతను గ్రూపులుగా చేసి స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కొనుగోలు చేసిన ఆ స్వయం ఉపాధి యూనిట్లు నాలుగేళ్లుగా గోదాములకే పరిమితం అయ్యాయి.....కోట్లాది రూపాయలు ప్రజాధనం వెచ్చించి కంపెనీల నుంచి కొనుగోలు చేసిన ఆ పరికరాలు ఎండకు ఎండి, వానకు తడిసి తుప్పు పట్టి పోతున్నా, గోదాముల గోడలు కూలి ధ్వంసం అవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. నా ఎస్సీలు, ఎస్టీలు, నా బీసీలు అంటూ నాడు డాంబికాలు పలికిన జగనన్నకు ఆయా యూనిట్లు పంపిణీ చేయాలన్న స్పృహ రాకపోవడంతో నాడు ఎస్సీల స్వయం ఉపాధి కాగితాలకే పరిమితమైన వైనమిది.


ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం పక్కన షెడ్డులో గోడకూలి అద్దాలు ధ్వంసమైన ఆటో

పంపిణీ చేయకుండానే.. పాడయ్యాయి

- గోదాములకే పరిమితమైన ఎస్సీల స్వయం ఉపాధి యూనిట్లు
- తుప్పు పట్టి, ధ్వంసమైపోతున్నా పట్టించుకోని వైనం
- భారీ సంఖ్యలో ఈ ఆటోలు, ట్రాక్టర్లు, మినీ ఎక్సకవేటర్లు
- నాలుగేళ్ళయినా పంపిణీ చేయని ఎస్సీ కార్పొరేషన్

గుంటూరు(విద్య), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నాడు టిడిపి ప్రభుత్వం అనేక స్వయం ఉపాధి పథకాలు అమలు చేసింది. ప్రత్యేకించి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాలకు రుణాలు ఇప్పించి ఎస్సీ యువత సొంత కాళ్ళపై నిలబడేలా చేశారు. అయితే 2019 తరువాత అధికారంలో వచ్చిన వైకాపా ప్రభుత్వం ఎస్సీ స్వయం ఉపాధి పథకాల్ని సమాధి చేసింది. అమలు చేసిన ఒకటీ అరా పథకాలు కూడా ఎస్సీలకు చేరలేదు. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమే గోదాముల్లో మూలుగుతున్న స్వయం ఉపాధి యూనిట్లు. గ్రామాల్లో మెరుగైన పారిశుధ్యం అమలు చేయడంతోపాటు ఎస్సీ యువతను గ్రూపులుగా చేసి స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఎస్సీ కార్పొరేషన్ నిధులతో ఈ ఆటోలు, ట్రాక్టర్లు, మినీ ఎక్సకవేటర్లు కొనుగోలు చేశారు. అయితే వీటి కొనుగోళ్ళలో భారీ మొత్తం కమీషన్ల రూపంలో చేతులు మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆటో రూ.2.50లక్షలు, ట్రాక్టర్ రూ.5.60లక్షలు, మినీ ఎక్సకవేటర్‌కు రూ.10లక్షలు వెచ్చించినట్లు సమాచారం. రాష్ట్ర స్థాయిలో పెద్దమొత్తంలో ఆయా పరికరాలు కొనుగోలు చేశారు. జిల్లాల వారీగా పంపిణీ చేయాలని, వాటిని జిల్లా కేంద్రాల్లోని ప్రైవేటు గోదాములకు తరలించారు. అయితే పంపిణీ చేయకముందే, ఈ ఆటోల్లో సాంకేతిక సమస్యలు వచ్చినట్లు సిబ్బంది చెబుతున్నారు. బ్యాటరీ బ్యాకప్ లేకపోవడం, చార్జింగ్ సమస్యలు తలెత్తాయి. దీంతో కంపెనీలకు సమాచారం ఇచ్చినా వారు సకాలంలో రాలేదు. ఫలితంగా పంపిణీ నిలిచిపోయింది. దాదాపు నాలుగు సంవత్సరాల నుంచి ఈ యూనిట్లు జిల్లా కేంద్రాల్లో గోదాముల్లో, ఎస్సీ కార్పొరేష్ కార్యాలయాల ఆవరణలో మగ్గుతున్నాయి. ఇందులో కొన్ని ఇప్పటికే ఉపయోగించడానికి వీలులేకుండా పాడైనట్లు సమాచారం. గుంటూరు నగరంలోని ఎస్సీ కార్పొరేషన్ సమావేశ మందిరం పక్కనే ప్రస్తుతం పదుల సంఖ్యలో ఈ ఆటోలు, ట్రాక్టర్లు, మినీ ఎక్సకవేటర్లు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్వయం ఉపాధి యూనిట్లు ఎస్సీ యువతకు పంపిణీ చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

మరమ్మతులు చేయించి పంపిణీ చేస్తాం

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా గత ప్రభుత్వ హయాంలో వీటిని కొనుగోలు చేశామని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ పీ ప్రేమకుమారి "ఆంధ్రజ్యోతి"కి వివరించారు. ఈ ఆటోలు, ట్రాక్టర్స్, ఎక్సవేటర్లు కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా పంపిణీ చేయలేదని, వాటికి మరమ్మతులు నిర్వహించి లబ్ధిదారులకు లేదా మున్సిపాల్టీలకు ఇవ్వాలని కొత్త ప్రభుత్వం నిర్ణయించినట్లు ఈడీ ప్రేమకుమారి తెలిపారు.


ఎటువంటి రక్షణ లేకుండా ఆరుబయట ఉన్న ట్రాక్టర్లు

సౌత్ ఇండియా పోటీల్లో జిల్లా లిఫ్టర్ల ప్రతిభ


పతకాలు సాధించిన లిఫ్టర్లతో అసోసియేషన్ ప్రతినిధులు

మంగళగిరి సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని సేలంలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు జరిగిన సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గుంటూరు జిల్లాకు చెందిన పవర్ లిఫ్టర్లు రెండు స్వర్ణ పతకాలు, ఒక రజతం, నాలుగు కాంస్య పతకాలు సాధించినట్టు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని తెలిపారు. మహిళల 84 కిలోలు పైబడిన సీనియర్స్ విభాగంలో బొల్లినేని చంద్రిక స్వర్ణ పతకంతోపాటు స్ట్రాంగ్ ఉమెన్ టైటిల్-2, జూనియర్స్ 84 కిలోలు పైబడిన విభాగంలో ఎస్కే షబీనా స్వర్ణ పతకం, సబ్‌జూనియర్స్‌లో పి.శ్రావణి రజతం, జూనియర్స్‌లో చాతుర్య, వినయశ్రీలు కాంస్య పతకాలు, పురుషుల సబ్‌జూనియర్స్ విభాగంలో జి.హేమవర్ధన్ రజత పతకం, జి.నాగగణేష్ కాంస్య పతకం సాధించారని చెప్పారు. పతకాలు సాధించిన లిఫ్టర్లను ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, సౌత్‌ఇండియా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సకల కోటేశ్వరరావు, జిల్లా వైస్‌చైర్మన్ ఆర్ఎన్ వంశీకృష్ణ, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

7న విజ్ఞాన్ యూనివర్సిటీలో స్నాతకోత్సవం


పోస్టర్స్ విడుదల చేస్తున్న వీసీ నాగభూషణ్

గుంటూరు(విద్య), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆన్‌లైన్ లెర్నింగ్, ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్‌లో ఎంసీఏ, ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులకు డిసెంబర్ 7న స్నాతకోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు కలిసి స్నాతకోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావ్ హాజరవుతారని తెలిపారు. స్నాతకోత్సవం సందర్భంగా యూనివర్సిటీ (ఎంబీఏ, ఎంసీఏ) ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ద్వారా విద్య పూర్తి చేసుకున్న 880 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనుందని వైస్ చాన్స్‌లర్ నాగభూషణ్ తెలిపారు.

కృషి, పట్టుదలతో ఉజ్వల భవిష్యత్తు

పెదకాకాని, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో అనుకున్న రంగాల్లో రాణించాలంటే కృషి, పట్టుదల అవసరమని, తద్వారా ఉజ్వల భవిష్యత్తు సాధించవచ్చని ఏఎన్‌యూ సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగ అధిపతి, దూర విద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సమీపంలో ఉన్న ఆమోదిని స్వచ్ఛంద సంస్థలో భోజన వితరణ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. నేటి సమాజానికి రోల్ మోడల్‌గా నిలవాలని సూచించారు. సమాజంపై అవగాహనతో సేవా కార్యక్రమాలు నిర్వహించటం సంతోషకరమన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 40.72 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు.

డేగల కష్టానికి ప్రతిఫలంగా ఏపీఐడీసీ చైర్మన్ పదవి

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- అట్టహాసంగా డేగల అభినందన సభ
- ఎమ్మెల్యేలు, కూటమి నేతల సందడి
- కదం తొక్కిన డేగల యూత్, అభిమానులు


డేగలను సన్మానిస్తున్న మంత్రి సవిత, ఆనందబాబు, పుల్లారావు, ఆలపాటి, నసీర్, మోపిదేవి

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా పార్టీ కోసం నిలిచి, అవిశ్రాంతంగా పోరాడిన డేగల ప్రభాకర్‌ను ఏపీఐడీసీ చైర్మన్‌గా నియమించి ముఖ్యమంత్రి చంద్రబాబు తగిన గౌరవాన్ని కల్పించారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత కొనియాడారు. ఏపీఐడీసీ చైర్మన్‌గా నియమితుడైన సందర్భంగా బుధవారం డేగల అభిమానులు, డేగల యూత్ సభ్యులు అట్టహాసంగా ఆయన అభినందన సభ నిర్వహించారు. గుంటూరు నాజ్‌సెంటర్ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి సిద్ధార్థ గార్డెన్స్ వరకూ కూటమి పార్టీల కార్యకర్తలు, డేగల అభిమానులు, యూత్ సభ్యులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొని నగర వీధుల్లో సందడి చేశారు. సిద్ధార్థ గార్డెన్స్ వద్ద ఆయనకు అభిమానులు భారీ గజమాలతో ఘనం స్వాగతం పలికారు. అనంతరం సిద్ధార్థ గార్డెన్స్‌లో నిర్వహించిన అభినందన సభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, అతిథులుగా ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన పలు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు హాజరై డేగల ప్రభాకర్‌కు అభినందనలు తెలిపారు. మంత్రి సవిత మాట్లాడుతూ పార్టీ కోసం, కార్యకర్తల కోసం నిరంతరం శ్రమించిన డేగల ప్రభాకర్‌కు ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కడం అభినందనీయమన్నారు. ఈ పదవితో ప్రభాకర్‌కు బాధ్యత మరింత పెరిగిందన్నారు. రాష్ట్రంలో నూతన పరిశ్రమల స్థాపనకు తనదైన శైలిలో కృషి చేయాలన్నారు. వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ పార్టీకి కష్టకాలంలో అండగా, ఆర్థికంగా, చేయూతగా ప్రభాకర్ నిలబడ్డారని కొనియాడారు. పరిశ్రమలను అభివృద్ధి చేయాలని సూచించారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసేవారికి ఎప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందనటానికి నిదర్శనం డేగల ప్రభాకర్‌ను చైర్మన్‌గా నియమించడమేనని అన్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు నసీర్, గల్లా మాధవి మాట్లాడుతూ గుంటూరు నగర అభివృద్ధిలో డేగల ప్రభాకర్ ముందుండాలని ఆకాంక్షించారు. డేగల ప్రభాకర్ మాట్లాడుతూ కష్ట పడేవారికి తగిన గుర్తింపు ఉంటుంది అనటానికి నిదర్శనం తనకు ఈ పదవి దక్కడమేనని అన్నారు. తనకు ఈ పదవి కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలను మూసివేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం నూతన పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తోందని అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా నూతన పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తూ, నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి, బాపట్ల ఎమ్మెల్యే వేగేసిన నరేంద్ర వర్మ, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు, ఎమ్మెల్సీ అశోక్ బాబు, మాజీ మంత్రులు మోపిదేవి వెంకటరమణ, ఆలపాటి రాజేంద్రప్రసాద్, లిడ్ కార్పొరేషన్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టెక్నాలజీ సంస్థ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ, టూరిజం చైర్మన్ నుకసాని బాలాజీ, కోవెలమూడి రవీంద్ర, డిప్యూటీ మేయర్ షేక్ షాజిల, రాష్ట్ర నాయకులు చిత్తబత్తిన చిట్టిబాబు, కనపర్తి శ్రీనివాస్, మద్దిరాల మ్యాని, కాసుకుర్తి హనుమంతరావు, బీసీ సెల్ అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్, ఆమంచి స్వాములు, తెలుగు యువత నాయకులు మల్లి, ఉగ్గిరాల సీతారామయ్య, జనసేన నాయకులు బోనబోయిన శ్రీనివాస్, గాదె వెంకటేశ్వర్లు, పార్వతి నాయుడు, వడ్రాణం మార్కండేయ బాబు పాల్గొన్నారు.

ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్


వల్లభాపురంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం కొల్లిపర మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జేసీ భార్గవ్‌తేజతో కలిసి ఆయన తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఎంత మేర కొనుగోలు చేశారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హనుమాన్‌పాలెంలో జరిగిన సమావేశంలో మనోహర్ మాట్లాడుతూ ధాన్యం తేమశాతం 17 కంటే ఎక్కువ ఉన్నా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ధాన్యాన్ని విక్రయించిన రైతులకు 24 గంటల వ్యవధిలోనే వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. ఏడీఏ ఉషారాణి, సివిల్ సప్లై డీఎం శ్రీలక్ష్మి, తహసీల్దార్ సిద్ధార్థ, వివిధ శాఖాధికారులు, నాయకులు వంగా సాంబిరెడ్డి, అడపా నారాయణరెడ్డి, మొవ్వా వెంకయ్య, ఆళ్ల వీరారెడ్డి, యర్రు వెంకయ్యనాయుడు, భీమవరపు కిశోర్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

క్రిమినల్ కేసులు పెడతాం..

తాడేపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు వ్యాపారస్తులు కనీస మద్దతు ధర కంటే తక్కువకు కొంటే క్రిమినల్ కేసులు పెడతామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరు, గుండిమెడ విచ్చేసిన ఆయన ధాన్యం కల్లాల వద్ద రైతులతో మాట్లాడి ధాన్యాన్ని పరిశీలించారు. మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం నేతలు పల్లె కృష్ణ, పి.సుబ్బారావు, బొప్పన గోపాలరావు, శివనాగేశ్వరరావు, ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేమూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం సాయంత్రం జంపని గ్రామంలో రైతులను కలుసుకున్నారు. రైతులు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు.

రైతులు సద్వినియోగం చేసుకోండి

దుగ్గిరాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధాన్యానికి ప్రభుత్వం ఇస్తున్న మంచి ధరను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మండల గ్రామం గొడవర్రు సమీపంలో కరకట్ట అంచున రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని బుధవారం పరిశీలించిన మంత్రి మనోహర్ రైతులతో మాట్లాడుతూ క్వింటాల్‌కు రూ.2300 నుంచి రూ.2320, 75 కిలోల బస్తాకు రూ.1725 నుంచి రూ.1740 చెల్లిస్తోందన్నారు. సర్పంచ్ విశ్వనాథపల్లి ఉమాదేవి, ఎంపీటీసీ సభ్యుడు శివకుమార్, జేసీ ఎ.భార్గవ్‌తేజ, వీఆర్వోలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

అధికారులపై మంత్రి ఆగ్రహం

కొల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని తక్కువ ధరకు దళారులకు అమ్మి నష్టపోవద్దని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులకు సూచించారు. బుధవారం కొల్లూరు మండలంలోని ఈపూరు, క్రాప గ్రామాల వద్ద రైతులు రోడ్లపై ఆరబెట్టుకున్న ధాన్యాన్ని మంత్రి పరిశీలించారు. తేమశాతం ఎక్కువగా ఉందనీ, నిబంధనలకు లోబడి ఉంటేనే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారని రైతులు మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. పైగా చాలా మంది రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బంది ఈకేవైసీ, ఈక్రాప్ చేయలేదనీ, దాని వల్ల కూడా తమ పంట కొనుగోలు చేయమంటున్నారని చెప్పారు. క్రాప వద్ద రైతులు కౌలు రైతు కార్డులు కూడా తమకు జారీ చేయలేదని మంత్రి దృష్టికి తీసుకు రావడంతో అధికారులపై వచ్చిన ఆరోపణలపై వారిని ప్రశ్నించగా ఆయా శాఖల అధికారులు నీళ్లు నమలడంతో వారిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సివిల్ సప్లై జిల్లా అధికారి విలియమ్స్, వ్యవసాయ శాఖ డీఏవో రామకృష్ణ, రేపల్లె ఏడీఏ విజయబాబు, తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, ఏవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లకు గండం

(5 పేజీ తరువాయి)

సవాలక్ష కొర్రీలు పెట్టి వాటిని రిజిస్టర్ చేయకుండా ఆపుతున్నారు.

అసైన్డ్, ఫారెస్టు ల్యాండు వంక

రైతులు ఇచ్చిన భూములు పట్టాభూములైతేనే రిజిస్ట్రేషన్ చేస్తామని, అసైన్డ్ భూములు ఉంటే వాటిని చేయమని ఆపారు. కొంతమంది రైతులు పట్టా భూములతోపాటు అసైన్డ్, ఫారెస్టు, సైనికులకు ఇచ్చిన భూములను కూడా ల్యాండ్ పూలింగులో ఇచ్చారు. ఇప్పుడు ఆ వంక పెట్టి వాటి రిటర్నబుల్ ప్లాట్లను సీఆర్డీఏ అధికారులు ఆపేశారు. వాటితోపాటు పట్టా భూములు కూడా ఇచ్చి ఉంటే వాటిని కూడా ఆపేశారు. దీంతో రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చినా సీఆర్డీఏ అధికారుల తీరులో ఏమాత్రం మార్పు రాలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


మూడేళ్లుగా కౌలు బకాయిలు

రాజధాని కోసం భూములిచ్చిన అసైన్డ్ రైతుల భూములపై సీఐడీ విచారణ పేరుతో గత ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగింది. అసైన్డ్ రైతుల భూములను నాట్ ట్యాలీడ్ జాబితాలో పెట్టింది. మొత్తం 1600 మంది రైతుల పొలాలను నాట్ ట్యాలీడ్ జాబితాలో పెట్టి 1300 మందికి క్లీన్ చిట్ ఇచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మిగిలిన 1300 మందికి క్లీన్‌చిట్ వస్తుందని, అందరితోపాటు తమకు కౌలు వస్తుందని భావించారు. కానీ అసైన్డ్ రైతుల ఆశ నిరాశగానే మిగిలింది.

కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు అవుతున్నా వారి భూములు ఇప్పటికీ నాట్ ట్యాలీడ్ జాబితాలోనే ఉన్నాయి. మూడేళ్లుగా కౌలు బకాయిలు అలానే ఉన్నాయి. దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న అసైన్డ్ రైతులు సీఆర్డీఏ అధికారుల తీరును నిరసిస్తున్నారు. సీఐడీ విచారణ పేరుతో కౌలు చెల్లించకుండా జాప్యం చేస్తున్న ప్రభుత్వ తీరుపైనా వారు ఆగ్రహంతో ఉన్నారు. మంత్రి నారాయణ, నారా లోకేశ్‌లను కలిసి తమ గోడు విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో టీడీపీకి చెందిన పలువురు రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

- ఇదే అదనుగా రోడ్డు నిర్మాణానికి తరలిస్తున్న కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు


వెంకుపాలెం కొండ సమీపంలో మట్టిని తరలిస్తున్న టిప్పర్లు

వినుకొండటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మట్టికి విపరీతమైన డిమాండ్ ఉండడంతో ప్రభుత్వ భూమి కనపడితే చాలు అక్రమార్కులు ఆ భూములను కబ్జాచేసి మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వినుకొండ మండలం వెంకుపాలెం కొండ సమీపంలోని సర్వే నంబరు 1లో కొందరు అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండ గత కొంతకాలంగా మట్టిని తరలిస్తూ అక్రమంగా లక్షలు గడిస్తున్నారు. కారంపూడి రోడ్డు నుంచి వెల్లటూరు రోడ్డు వరకు సుమారు 5 కిలోమీటర్ల మేర తారు రోడ్డు మంజూరైంది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇదే అదునుగా గుట్టుచప్పుడు కాకుండ సుమారు రూ.4 కోట్లు విలువ చేసే రోడ్డు నిర్మాణ పనులకు మట్టిని తరలించి చకచక పనులు కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉండగా కొందరు ఆ మట్టిని వినుకొండ పట్టణంలోని పలు ప్రాంతాలకు విక్రయించి అక్రమంగా లక్షల గడిస్తున్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు పలువురు సమాచారం అందించినప్పటికీ వారు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. ఇప్పటికే సర్వే నంబరు 1లో సుమారు 25 ఎకరాల మేరకు 15 అడుగుల మేర మట్టిని తరలించారు. గత కొంత కాలంగా మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు విమర్శిస్తున్నారు. ఇకనైనా జిల్లా రెవెన్యూ, మైనింగ్ అధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


అక్రమంగా మట్టిని తరలించి నిర్మిస్తున్న రోడ్డు

వాహనాలను నిలిపివేస్తాం...

రోడ్డు నిర్మాణ పనులకు వినియోగిస్తున్న మట్టి తవ్వకాలకు అనుమతులపై తహసీల్దార్ సురేష్ నాయక్‌ను వివరణ కోరగా మట్టిని తరలిస్తున్న విషయం తమ దృష్టికి రాలేదని, సిబ్బందిని పంపించి వాహనాలను నిలుపుదల చేస్తామని తెలిపారు.

అధికలోడుతో ప్రయాణం నిషేధం

- రూ.20 వేలతోపాటు టన్నుకు రూ.2 వేలు జరిమానా
- రవాణా శాఖాధికారి టి.సంజీవ్ కుమార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసరావుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'మోటార్ వాహన చట్టం ప్రకారం అనుమతించిన వాహనాలు బరువుకు మించి అధికలోడుతో ప్రయాణించడం నిషేధం. అనుమతించిన బరువు కన్నా 5.1 వరకు మార్జిన్ ఉంది. అంతకుమించి బరువుతో వాహనాలు రహదారుల్లో ప్రయాణిస్తే జరిమానాలు విధిస్తాం' అని రవాణాశాఖాధికారి టి.సంజీవ్ కుమార్ తెలిపారు. 'మామూళ్ల ఓవర్‌లోడ్' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం వెలువడిన కథనానికి ఆయన స్పందించారు. అనుమతికి మించి అధిక లోడ్‌తో టిప్పర్లు, లారీలు ప్రయాణిస్తే మోటార్ వాహన చట్టం ప్రకారం రూ.20వేలతో పాటు అదనంగా ప్రతి టన్నుకు రూ.2 వేలు జరిమానా విధించడంతోపాటు డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్ కూడా రద్దు చేస్తామని స్పష్టం చేశారు. అధిక లోడ్‌తో ప్రయాణిస్తున్న వాహనాలను గుర్తించి వారిపై 29 కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానాగా రూ.12,84,700 వసూలు చేసినట్లు తెలిపారు. అధిక లోడుతో వాహనాలు తిప్పకుండా టిప్పర్ యజమానులు రవాణా శాఖకు సహకరించాలని కోరారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

- ఇద్దరు నిందితుల అరెస్టు


నిందితులను అరెస్టు చేసిన ఎక్సైజ్ వన్ టౌన్ సీఐ లత, ఎస్‌ఐలు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మద్యాన్ని తీసుకొచ్చి గుంటూరులో విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ శాఖ వన్ టౌన్ సీఐ బి.లత బుధవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. నల్లచెరువు ప్రాంతానికి చెందిన షేక్ ఇంతియాజ్ అలియాస్ మున్న అనే వ్యక్తి తెలంగాణ రాష్ట్రం నుంచి 13 మ్యాన్షన్ హౌస్ బ్రాందీ బాటిళ్లను తీసుకొచ్చి ద్విచక్ర వాహనంపై పొన్నూరు రోడ్డులోని కరెంట్ ఆఫీస్ వద్ద విక్రయిస్తున్నాడు. అదేవిధంగా టూ టౌన్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని లాలుపురం గ్రామానికి చెందిన దేవరశెట్టి శ్రీనివాసరావు అనే వ్యక్తి చిలకలూరిపేట రోడ్డులో ఏటుకూరు రోడ్డు సమీపంలోని హైవే అండర్ పాస్ వద్ద 12 తెలంగాణ మద్యం బాటిళ్లను ద్విచక్ర వాహనంపై తిరుగుతూ విక్రయిస్తున్నాడు. సమాచారం మేరకు వీరిద్దరిని అరెస్టు చేసి, వారి వద్ద 25 తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఎస్సైలు తిరుమలేశ్వరరావు, మహమ్మద్ ఖాసిం షరీఫ్, కానిస్టేబుళ్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో దంపతుల ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ భర్త మృతి
- కోలుకున్న భార్య

నకరికల్లు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మొదట భార్య ఆత్మాహత్యాయత్నం చేసింది. ఇది తట్టుకోలేక భర్త ఆత్మహత్యాయత్నం చేశాడు. భార్య కోలుకోగా, భర్త మృతి చెందాడు. నకరికల్లు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నరసరావుపేట ఇస్లాంపేటకు చెందిన షేక్ ఖాదర్‌వలి, మంజు దంపతులు వీరి కుమార్తెకు పది నెలల క్రితం వివాహం చేశారు. ఇంతకుముందు ఉన్న అప్పులకు తోడు వివాహం సందర్భంగా అప్పులు చేయడంతో మొత్తం రూ.5 లక్షలకు అప్పు చేరుకుంది. అప్పు తీర్చే మార్గం కన్పించక భార్య, భర్తలు ఇద్దరూ తరచూ గొడవ పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 21న ఖాదర్‌వలి, మంజుల మధ్య ఘర్షణ జరగటంతో మంజు ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స నిమిత్తం ఆమెను నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ సంఘటనతో మనస్తాపానికి గురైన ఆమె భర్త ఖాదర్‌వలి ఈ నెల 24న నకరికల్లు అడ్డరోడ్డు వద్దకు వచ్చి ఎలుకల మందు తిని వాంతులు చేసుకున్నాడు. వాంతులతో భయానికి గురైన ఖాదర్‌వలి తన స్నేహితునికి ఫోన్ చేసి తాను ఎలుకల మందు తిన్నానని, ఆస్పత్రికి తీసుకువెళ్లాలని కోరాడు. దీంతో ఖాదర్‌వలిని అతని స్నేహితుడు నరసరావుపేట ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతున్న అతని భార్య మంజు కోలుకొని ఈ నెల 26న ఇంటికి చేరుకుంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఖాదర్‌వలి బుధవారం మృతి చెందాడు. నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైళ్ల రద్దు, దారి మళ్లింపు

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా నంద్యాల మార్గంలో కొన్ని రైళ్లను రద్దు, మరికొన్నింటిని దారి మళ్లిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వర్గాలు తెలిపాయి. డిసెంబరు 3 నుంచి 13వ తేదీ వరకు నంబరు 17228 గుంటూరు - డోన్, డిసెంబరు 4 నుంచి 14వ తేదీ వరకు నంబరు 17227 డోన్ - గుంటూరు రైళ్లను పూర్తిగా రద్దు చేస్తున్నామని పేర్కొన్నాయి. డిసెంబరు 6వ తేదీన నంబరు 22883 పూరీ - యశ్వంత్‌పూర్, 7వ తేదీన నంబరు 22884 యశ్వంత్‌పూర్ - పూరీ, డిసెంబరు 4, 11 తేదీల్లో నంబరు 22831 హౌరా - యశ్వంత్‌పూర్, డిసెంబరు 6, 13 తేదీల్లో నంబరు 22832 యశ్వంత్‌పూర్ - హౌరా ఎక్స్‌ప్రెస్‌లను నంద్యాల నుంచి దారి మళ్లిస్తారు. నంబరు 17253 గుంటూరు - ఔరంగబాద్ ఎక్స్‌ప్రెస్‌ని డిసెంబరు 4 నుంచి 12వరకు 120 నిమిషాల పాటు రీషెడ్యూల్ చేసి నడుపుతామని రైల్వేవర్గాలు తెలిపాయి.

హాల్ట్‌స్టేషన్‌గా మారిన చినరావూరు

తెనాలి - రేపల్లె సెక్షన్‌లో ఉన్న చినరావూరు రైల్వేస్టేషన్‌ని రైల్వేబోర్డు హాల్ట్‌స్టేషన్‌గా మార్పు చేసింది. 2025 జనవరి 1వ తేదీ నుంచి ఈ ఉత్తర్వులు అమలులోకి రానున్నాయి. దీంతో ఆ సెక్షన్‌లో ఒక్క వేమూరు మినహా అన్ని హాల్ట్‌స్టేషన్లుగా మారాయి.

వికాస ఎన్నికలకు నామినేషన్లు దాఖలు

పెదకాకాని, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయ ఉద్యోగ సంఘం (వికాస) ఎన్నికలకు బుధవారం నామినేషన్లు దాఖలు అయ్యాయని ఎన్నికల అధికారి ప్రొఫెసర్ ఎస్.మురళీమోహన్ తెలిపారు. కాగా ఉద్యోగులు ఫ్రెండ్స్ ప్యానెల్‌గా ఏర్పడి నామినేషన్ వేశారు. ఫ్రెండ్స్ ప్యానెల్ అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్.ప్రసాద్ (అధ్యక్షుడు), డి.విజయ ప్రకాష్ బాబు (ఉపాధ్యక్షుడు), జె.శ్రీనివాసరావు (కార్యదర్శి), టి.వెంకటేష్, ఎన్.నాగేశ్వరరావు (సంయుక్త కార్యదర్శులు), కె.యేషయ్య (కోశాధికారి), ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా.. జి.శ్రీను, కె.శశిధర్, పి.నాగరాజు, ఎన్.వెంకటేశ్వరరావు, ఇ.శ్రీనివాస రెడ్డి, ఎన్.శ్రీనివాసరావు, టి.వెంకటేశ్వరరావు, సీహెచ్ సాంబశివరావు, సీహెచ్ ఆనంద్ నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి ప్రొఫెసర్ ఎస్. మురళీ మోహన్ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114,122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

43,594 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 46,174 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 43,594 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 38,956 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	7500	13500
నెంబరు. 5	8500	12000
273	8200	10000
341	8000	14000
4884	–	–
సూపర్ 10	11500	11500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16500
బ్యాడిగి	7500	13500
దేవనూరు డీలక్స్	8000	13500
తెల్లకాయలు	4500	11000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	8000	14500
నెంబరు.5	8300	12500
273	9500	11000
341	8000	14500
4884	8000	14000
సూపర్ 10	9000	11500
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16500
బ్యాడిగి	8000	12600
దేవనూరు డీలక్స్	10000	13000
తెల్లకాయలు	4500	10000

భూసార పరీక్ష ఆధారంగా ఎరువులు వినియోగించాలి

బాపట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు విని యోగించాలని బాపట్ల ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.బాలమురళీధర్ నాయక్ తెలిపారు. దళిత బహుజన రీసోర్స్‌సెంటర్ బాపట్ల ఏరియా కోఆర్డినేటర్ ఎం.శ్రీలత అధ్యక్ష తన మండలంలోని ఎస్సీ, ఎస్టీ రైతులకు భూసార పరీక్షల ఫలితాల పత్రాలు పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ మురళీధర్ నాయక్ పాల్గొని మాట్లాడుతూ రైతులు భూసారం పెంచుకోవటానికి రసాయనిక ఎరువులు త గ్గించి పచ్చిరొట్ట ఎరువులు, పశువుల ఎరువులు వాడుకుంటే నేల ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఉషా మాట్లాడుతూ రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీబీఆర్‌సీ రీజనల్ కోఆర్డినేటర్ గార్ల కోటేశ్వర రావు, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి : శ్రీధర్

బాపట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల హామీలు కూటమి నాయకులు అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జేబీ శ్రీధర్ డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి సమావేశం బుధవారం జరిగింది. సమావేశంలో శ్రీధర్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయకపోవటం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. హామీలు అమలు చేసి విద్యార్థులకు, రైతులకు కార్మికులకు అండగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల వారి నుంచి అర్జీలు స్వీకరించారు.

రైతులు దళారులను నమ్మవద్దు : తహసీల్దార్

నగరం, నవంబరు27 (ఆంధ్రజ్యోతి) : రైతులు చెమటోడ్చి ఆరుగాలం పండించిన వరి పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని తహసీల్దార్ జీ.నాంచారయ్య అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, డీసీఎంఎస్ ఇన్‌చార్జ్ శ్రీకాంత్, వ్యవసాశాఖాధికారి కె.నాగశ్రీనివాస్, కె.తిరుపతమ్మ పాల్గొన్నారు.

పెసర్లంకలో రైతు అవగాహన సదస్సు

కొల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఏరీస్ ఆగ్రోస్ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పెసర్లంకలో నిర్వహించిన సదస్సులో సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జయప్రదీప్ సుబ్రహ్మణ్యం పాల్గొని మాట్లాడుతూ, రైతులు వ్యవసాయాధికారులు, సంస్థ ప్రతినిధుల సూచనల మేరకు పంటల్లో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు పొందడంతో పాటు దేశానికి పౌష్టికాహారం అందించవచ్చని వివరించారు. సదస్సులో ఎన్‌వి రత్తయ్య, మాధవ్, పి.వెంకటేశ్వరరావు, సీనియర్ మేనేజర్ సుందరరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా రవికుమార్


రవికుమార్

రేపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టులో ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్స్‌కి స్టాండింగ్ కౌన్సిల్‌గా రేపల్లెకు చెందిన న్యాయవాది కొనకపల్లి రవికుమార్‌ను నియమించినట్లు బుధవారం సాయంత్రం హైకోర్టు అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ ఉత్తర్వులు వెలువరించారు. రవికుమార్ మాట్లాడుతూ శక్తివంచన లేకుండా విధులు నిర్వహిస్తానని తెలిపారు. తమకు సహకరించిన హైకోర్టు సీనియర్ న్యాయవాది బింజుపల్లి సుబ్బారావు హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మీనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

వేమూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ హెచ్చరికల మేరకు మండల పరిధిలోని ఖరీఫ్ సాగు రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సునీత సూచించారు. ఈ నెల 29, 30 తేదీలలో తుఫాన్ కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. సూచనకు అనుగుణంగా వరి కోతలు కోయవద్దని తెలిపారు. డిసెంబరు నెల 2వ తేదీ తరువాత వరి కోతలు కోసుకోవచ్చని సూచించారు.

వ్యక్తిగత సెలవుపై పరిమితి విధించటం అన్యాయం

● ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య

బాపట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సెలవులపై విద్యాశాఖాధికారులు పరిమితి విధించటం అన్యాయమని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నాయకులు అన్నారు. ఈ విషయమై బుధవారం వారు మాట్లాడుతూ ఉన్న స్టాఫ్‌లో 7 నుంచి 10 శాతం మాత్రమే వాడుకోవాలని షరత్‌లు విధించటం విచారకరమన్నారు. ఉపాధ్యాయులు అత్యవసర, ఆరోగ్య సమస్యల కారణాలతో తమ సాధారణ సెలవులు, ప్రత్యేక సాధారణ సెలవులు వినియోగించుకోవటంపై ఆంక్షలు విధించటం సరికాదన్నారు. వెంటనే ఆంక్షలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య చైర్మన్ బడుగు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

చిన్నారులందరిని బడికి పంపించాలి : ఎంపీడీవో

కర్లపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉర్లమ్మ ఎస్టీ కాలనీలో చిన్నారులందరిని బడికి పంపించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు ఎస్టీ కుటుంబాల పెద్దలకు సూచించారు. మండలంలోని గణపవరం పంచాయతీలో గల ఉర్లమ్మ ఎస్టీకాలనీని ఎంపీడీవో బుధవారం సందర్శించారు. ఎటువంటి గుర్తింపు పత్రాలు లేని ఎస్టీలను గుర్తించి వారికి ఆధార్, రేషన్, ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు వచ్చేవిధంగా పంచాయతీ అధికారులు చూడాలని ఆదేశించారు.

కర్లపాలెంలో పశువైద్య సేవలు

కర్లపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పాలకేంద్రం వద్ద సంగం డెయిరీ ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పశు వైద్యులు, సిబ్బంది ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు డాక్టర్ కె.ప్రసాద్, శివరామకృష్ణ, ఉమామహేశ్వరరావు, పొట్లూరి ఆంజనేయులు పశువైద్య సేవలందించారు. పాలకేంద్రం అధ్యక్షులు సుబ్బరాజు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో లింగనిష్పత్తి తేడా ఉంటే సహించం

● ఎన్నికల రోల్ అబ్జర్వర్ ఎ.సూర్యకుమారి
● పర్చూరు ఈఆర్‌వోకు మెమో జారీ


సమావేశంలో మాట్లాడుతున్న సూర్యకుమారి, కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల,నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితాలో లింగనిష్పత్తి తేడా అధికంగా ఉంటే సహించేది లేదని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి, ఎన్నికల రోల్ అబ్జర్వర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. సం క్షిప్త సవరణ ఓటర్ల జాబితాపై ఈఆర్‌వోలతో, ఎఈఆర్‌వోలతో బుధవారం కలెక్టరేట్‌లో ఆమె సమావేశమయ్యారు. సమావేశంలో సూర్యకుమారి మాట్లాడుతూ పర్చూరు, చీరాల నియోజకవర్గాలలో లింగనిష్పత్తి సరిగ్గాలేకపోవటం ఏమిటని అధికారులను నిలదీశారు. చీరాల, వేమూరు నియోజకవర్గాలలో బీఎల్‌వోలు సరిగ్గాపనిచేయలేదని గు ర్తించామన్నారు. గైర్హాజరైన పర్చూరు ఈఆర్‌వోకు మెమో జారీ చేయాలని ఆదేశించారు. మృతుల ఓటర్ల తొలిగింపు చేయకపోవటం ఏమిటని ప్రశ్నించారు? కొత్త ఓటర్లను చేర్పించటం కొరకు అన్ని ప్రాంతాలలో విస్తృతంగా అవ గాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితాకు 2.73 లక్షల దరఖాస్తులు వచ్చాయ ని తక్షణమే వాటిని విచారించాలన్నారు. ఆధార్ అనుసంధానం ప్రక్రియ కేవలం 84 శాతం ఉండటంపై అస హనం వ్యక్తం చేశారు. పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ జరగాలంటే ప్రతి ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలన్నారు. గడిచిన 8 నెలల్లో 3,163 మంది ఓటర్లు వలసలు వెళ్ళటంపై ఆరా తీశారు. జనవరిలో సవరణ ఓటర్ల జాబితా విడుదల చేస్తామని తెలిపారు.

ప్రజలు నుంచి వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిష్కరిస్తున్నామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. నూతనంగా 14,556 మంది దివ్యాంగులకు ఓటు హక్కు కల్పించామన్నారు. అక్టోబరు 27వ తేది నాటికి జిల్లాలో 12,91,065 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ వివరించారు. యువతకు ఓటు హక్కు కల్పించేందుకు క్షేత్ర స్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మృతుల ఓటర్లపై విచారణ జరిపి తొలిగిస్తామన్నారు. సీఎంవోకి వెళ్ళిన ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి విచారించాలని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం 26 అర్జీలు పీజీఆర్‌ఎస్‌లో నమోదు కాగా ఒక్కొక్కటిగా సమీక్షించారు. సీఎం, మంత్రులకు వెళ్ళిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు తహసీల్దార్‌లతో ఆర్డీవోలు సమీక్షలు నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలుపాల్గొన్నారు.

పరిశ్రమలపై సమగ్ర సర్వే నిర్వహించాలి

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై సమగ్ర సర్వే నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఎంఎస్ఎంఈ నిర్వహణ సర్వేపై బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా, మండల స్థాయి అధికారులకు వీక్షణా సమావేశం ద్వారా కలెక్టర్ అవగాహన కల్పించారు. పరిశ్రమలను గుర్తించే కార్యక్రమానికి రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ అత్యాధునికమైన సర్వే సపోర్ట్‌యాప్‌లో ఎం.ఎస్.ఎంఇలను నిక్షిప్తం చేయాలన్నారు. ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ కనెక్షన్‌లను సైతం క్యాటగిరి-1, 2, 3 కింద నిర్ధారించాలన్నారు. చిన్న పరిశ్రమలు, వివిధ ఉత్పత్తులు ఉండే వ్యాపారాలను సైతం ఇందులో చేర్చాలన్నారు. సర్వేకు సంబంధించిన వివరాలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ ఇన్‌చార్జి జీఎం ఎ.జయలక్ష్మి, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ ఎం.మధు, జోనల్ మేనేజర్ కె.మంగాదేవి, పరిశ్రమల శాఖ ఏడీ ఏ సుమధరవాణి, ఐపీవో వి.సురేంద్ర, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కె.ప్రదీప్

కర్లపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల నియంత్రణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిఫార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ కె.ప్రదీప్ అన్నారు. సిఫార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ, మండల న్యాయ సేవ అధికార సంస్థల ఆధ్వర్యంలో కర్లపాలెం మండల సచివాలయ ప్రాంగణంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన 'బాల్ వివాహ ముక్త్ భారత్' కార్యక్రమంపై బుధవారం జరి గిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ లాయర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి గ్రామం బాల్య వివాహరహిత గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో యాక్సెస్ టు జస్టిస్ జిల్లా కోఆర్డినేటర్ బడుగు కిషోర్, సిఫార్డ్ కోఆర్డినేటర్ ప్రభాకర్, కర్లపాలెం పంచాయతీ మహిళా సంరక్షణ కార్యదర్శి సౌందర్య, పారా లీగల్ వలంటీర్ ఖాన్, సిఫార్డ్ సిబ్బంది నాగరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులు పాఠశాల దశ నుంచే తమ రంగాన్ని ఎంచుకోవాలి : అలేఖ్య


అలేఖ అభినందన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు తదితరులు

పిట్టలవానిపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినీ, విద్యార్థులు పాఠశాల దశ నుండే వారు ఎంచుకున్న వివిధ రంగాలలో రాణించేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఐఏఎస్ ర్యాంక్ సాధించిన రావూరి అలేఖ్య అవగాహన కల్పించారు. మండలంలోని అల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.పద్మారావు అధ్యక్షతన అలేఖ్యకు అభినందన సభను ఏర్పాటు చేసి పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అల్లూరు గ్రామ సర్పంచ్ ఉప్పు చెంచులక్ష్మి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నంగు శ్రీనివాసరెడ్డి, గ్రామ పెద్దలు అచ్యుత రామరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, బంధువులు, కుటుంబ సభ్యులు ఉన్నారు.

రాష్ట్రీయ బాలల ఆరోగ్యప్రగతి కార్యక్రమం

పిట్టలవానిపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామపంచాయతీ సచివాలయ-1 పరిధిలోని నదిముల్లాయపాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆరోగ్యప్రగతి రికార్డు నమోదు చేసినట్టు చందోలు సచివాలయం-1 ఏఎన్ఎం సుజాత అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ విద్యార్థి చిరునామా, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, పుట్టుమచ్చలు, ఆరోగ్య రికార్డు చేసిన పాఠశాల తరగతి,బ్లడ్ గ్రూపు తదితర అంశాలను నమోదు చేసుకున్నారు. స్థానిక వైద్యశాలలకు సమాచారాన్ని అందజేయటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండీ రహంతుల్లా, ఉపాధ్యాయులు ఖాశీం, ఆశా వర్కర్ జెరీనాబేగం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన

బాపట్ల,నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ఉద్యోగుల కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని సూర్యలంక తీరంలో నిర్వహించారు. ఆదర్శనగర్ నగర వనం పార్కులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు కుటుంబ సభ్యులతో కలిసి ఆటపాటలు, సంగీత నృత్యాలతో సరదాగా గడిపారు. కార్తీక పూజలు నిర్వహించి వనభోజనాలు చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్ఈ జి.ఆంజనేయులు మాట్లాడుతూ నిత్యం విధి నిర్వహణలో బిజీగా ఉండే ఉద్యోగులంతా ఆత్మీయంగా కలిసి కుటుంబ సభ్యులతో ఇలాంటి కార్యక్రమం నిర్వహించటం సంతోషదాయకమన్నారు. అతిథులను నిర్వాహకులు ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో ఏడీఈ పి.శ్రీనివాసరావు, చెరుకుపల్లి ఏఈ పెరుగు శ్రీనివాసరావు, పట్టణ, రూరల్ ఏఈలు సాయి శ్రీనివాస్, కోటేశ్వరరావు, సర్కిల్ పరిధిలోని ఏడీలు, ఏఈలు, లైన్‌మెన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తున్న ప్రభుత్వం : ఏడీఏ

కర్లపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ధాన్యం కనీస మద్దతు ధరను 100 కేజీలు ఏ గ్రేడ్ ధాన్యంకు రూ2,320, కామన్ రకం ధాన్యంకు రూ.2,300 కనీస మద్దతు ధరను ప్రభుత్వం కల్పిస్తున్నదని బాపట్ల వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మి అన్నారు. మండలంలోని చింతాయపాలెం, గణపవరం గ్రామాలలో వ్యవసాయాధికారి సుమంత్ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్ష్మి తనప్రసంగాన్ని కొనసాగిస్తూ గోనె సంచులు రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంటాయని కూలీలు, రవాణా ఖర్చు ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఈనెలాఖరి వరకు తుఫాన్ ఉందని హెచ్చరించినందున రైతులు ఎవరూ వరికోతలు కోయవద్దని సూచించారు. ఆహారం, పోషణ భద్రత కింద ఇచ్చిన విబిఎన్ 8 చిరు సంచులను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వేదశ్రీ, ధ్రువకుమార్ రైతులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ


చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి అందించిన సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు బుధవారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అందజేశారు. భట్టిప్రోలు మండలంలోని పెద పులివర్రు, పల్లెకోన, ఓలేరు గ్రామాల బాధిత లబ్ధిదారులకు రూ.1,47,414 విలువ చేసే నాలుగు చెక్కులు పంపిణీ చేశారు. గుంటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వాటిని లబ్ధిదారులకు అందజేశారు.

అగ్నికుల క్షత్రియ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

రేపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని అగ్నికుల క్షత్రియ సమస్యల సాధన కోసం కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, సీనియర్ మత్స్యకార నాయకుడు పంతాని మురళీధరరావు అన్నారు. బుధవారం విజయవాడలోని గొల్లపూడి బీసీ సంక్షేమ భవన్‌లో ఏపీ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మిడిరామకృష్ణ ప్రమాణస్వీకారం సందర్భంగా శాలువా కప్పి అభినందించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి నాయకుడిగా ఎదిగిన రామకృష్ణ సంఘీయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్, రేపల్లె మండల మాజీ ఉపాధ్యక్షుడు కె.రాజశేఖర్, బీసీ నాయకులు మోపిదేవి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

కూలిన చప్టాను పునరుద్ధరించాలని వినతి పత్రం

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కూలిపోయిన చప్టాను రైతు, కౌలురైతు సంఘ నాయకులు పరిశీలించారు. బుధవారం భట్టిప్రోలు మండల పరిధిలో ఇటీవల కూలిపోయిన చానల్ చప్టాను పరిశీలించిన సంఘ నాయకులు అనంతరం భట్టిప్రోలులోని తహసీల్దార్ కార్యాలయంలో చప్టా పునఃనిర్మాణంపై వినతి పత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ, చప్టా కూలిపోవడం వల్ల నాలుగు మండలాల్లో సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరు అందని పరిస్థితి తలెత్తిందన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రైతాంగానికి సాగునీరు అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో ఏఐకెఎస్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య, కౌలు రైతు జిల్లా అధ్యక్షులు తోడేటి సురేష్, సీపీఎం మండల కార్యదర్శి జి.సుధాకర్, మురుగుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో జిల్లా చాంపియన్స్‌గా యడ్లపల్లి విద్యార్థులు

చుండూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : యడ్లపల్లి శ్రీఆలపాటి వెంకట్రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో చాంపియన్‌షిప్ సాధించారు. ఈ పోటీలలో యడ్లపల్లి విద్యార్థులు ఐదు ఈవెంట్స్‌లో ప్రథమస్థానం, 8 ఈవెంట్స్‌లో ద్వితీయ స్థానం, ఐదు ఈవెంట్స్‌లో తృతీయ స్థానం సాధించి జిల్లా చాంపియన్స్‌గా నిలిచారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుర్రా శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు వేమూరి శరత్‌బాబు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

చేతుల పరిశుభ్రతే శ్రీరామరక్ష

చెరుకుపల్లి, నవంబరు27(ఆంధ్రజ్యోతి) : చేతులు పరిశుభ్రంగా ఉంటేనే రోగాలను నివారించవచ్చని సోషల్ యాక్టివిటీస్ ఫర్ ఓవరాల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వాహకుడు భగవాన్ అన్నారు. బుధవారం మండలంలోని కావూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు కేసన కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు కేవీ రామ్మోహన్‌రావు, ప్రమీల, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యసేవలను పరిశీలించిన ఎంపీడీవో

కర్లపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం పెదపులుగువారిపాలెం గ్రామంలో జరుగుతున్న 108 వైద్య సేవలను ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలికంగా బాధపడుతున్న వృద్ధులకు క్రమం తప్పకుండా పరీక్షలు చేసి మందులు ఇవ్వాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధురాలి నేత్రాలు దానం

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో మృతి చెందిన వృద్ధురాలి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. భట్టిప్రోలు పంచాయతీ పరిధిలో అద్దేపల్లికి చెందిన శనగపల్లి సామ్రాజ్యం (69) బుధవారం తెల్లవారుజామున అనారోగ్య కారణాలతో మృతి చెందింది. ఆమె కుమారుడు శ్రీనివాసరావు తన తల్లి నేత్రాలను దానం చేస్తున్నట్లు ప్రకటించి శంకర్ నేత్ర వైద్యశాలకు సమాచారం ఇచ్చారు. అక్కడ నుంచి వైద్య సిబ్బంది వచ్చి వృద్ధురాలి నేత్రాలను తీసుకువెళ్లారు.

పీఎం సూర్యఘర్ పథకంపై కేంద్ర మంత్రితో చర్చించిన ఎంపీ


కేంద్ర మంత్రి ప్రహ్లదజోషితో ఎంపీ కృష్ణప్రసాద్

బాపట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పీఎం సూర్యఘర్ బిజిలి యోజన పథకం గురించి బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ బుధవారం పార్లమెంట్ ఆవరణలో కేంద్ర న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ మంత్రి ప్రహ్లద జోషితో చర్చించారు. మర్యాదపూర్వకంగా మంత్రిని కలిసి పథకం అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంకా వివిధ అంశాలపై ఎంపీ చర్చించారు.

దేగల ప్రభాకర్‌కు ఎమ్మెల్యే వేగేశన అభినందనలు


దేగల ప్రభాకర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన దేగల ప్రభాకర్‌ను ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కలిసి అభినందించారు. గుంటూరు సిద్దార్థ గార్డెన్స్‌లో మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేసి పలు అంశాలు గురించి చర్చించారు.

ప్రజానాయకుడిని కోల్పోయాం : మంత్రి అనగాని


నివాళులర్పిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తోటివారికి సహాయపడాలనే సద్గుణంతో మెలిగే నారా రామ్మూర్తినాయుడు మరణం జీర్ణించుకోలేని విషయమని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. నారావారిపల్లెలో బుధవారం ఆయన స్వగృహంలో సంతాపసభ సందర్భంగా రామ్మూర్తినాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుమారులైన సినీనటుడు నారా రోహిత్, సోదరులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్యేగా విధులు నిర్వహించి ప్రజలకు ఎనలేనిసేవలు అందించి ప్రజల మన్ననలు పొందిన వ్యక్తి రామ్మూర్తినాయుడు అన్నారు. అలాంటి వ్యక్తి మన మధ్యలేకపోవటం బాధాకరమన్నారు.

హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలి

● జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ


స్టాల్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ ఎస్.విజయమ్మ

బాపట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగియుండాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ తెలిపారు. మండలంలోని సూర్యలంక సముద్రతీరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో అవగాహన స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌ను డీఎమ్ అండ్ హెచ్‌వో ప్రారంభించి అక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడుతూ స్టాల్‌లో ఉండే సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ శ్యాక్స్ జిల్లా మేనేజర్ జానీబాషా, గ్రామసిరి, మహిళా మండలి సిబ్బంది పాల్గొన్నారు.

● రేపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలని ఏబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీసీ రవి చంద్రకుమార్ అన్నారు. బుధవారం ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో రెడ్‌రిబ్బన్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్‌వ్యాధిపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఎయిడ్స్ వ్యాధి నివారణ చర్యల్లో బాగంగా విద్యార్థులకు డిబేట్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎం.దాసు, బీ.కోటేశ్వరరావు,వీవీ రవీంద్ర, కె.బాలగురవయ్య, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలించేవారు మంచి వారైతే రాజ్యాంగం మంచిగా ఉంటుంది

● అంటరానితన నిర్మూలన పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చార్వాక

బాపట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పాలించే వారు మంచి వాళ్ళు అయితే రాజ్యాంగం మంచిగా ఉంటుందని, లేకుంటే చెడ్డదవుతుందని ఆనాడే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పినట్లు అంటరానితన నిర్మూలన పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక తెలిపారు. మండలంలోని నరసాయపాలెం గ్రామంలో 75వ రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించారు. అంటరానితన నిర్మూలన పోరాటసమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ చార్వాక అధ్యక్షత వహించి మాట్లాడుతూ విభిన్న కులాలు, మతాలు, ప్రాంతాలు ఉన్న దేశానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గొప్ప రాజ్యాంగాన్ని అందించి అందరికి హక్కులు కల్పించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యువపారిశ్రామికవేత్త ఆర్మీ విజయ్, బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు, మాలమహానాడు రాష్ట్రఅధికార ప్రతినిధి శీలం రోజన్‌బాబు, గొర్రెముచ్చు వందనం, టీడీపీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ, కార్యదర్శి కూచిపూడి ఝాన్సీరాణి, టీడీపీ నాయకులు తిరువీధుల శంకరప్రసాద్, మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్మతోటి పౌలు, రేగుల గడ్డ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న అంటరానితన నిర్మూలన పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చార్వాక

మాల కార్పొరేషన్ చైర్మన్‌ను సత్కరించిన దళిత నాయకులు

బాపట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పి.విజయ్‌కుమార్‌ను బుధవారం అంటరానితన నిర్మూలన పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక దళిత నాయకులతో కలిసి ఆయనను సత్కరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని మాలల పరిస్థితులను ఆయనకు వివరించారు. త్వరలో రాష్ట్రంలో పర్యటించి సమస్యలు తెలుసుకోనున్నట్లు ఆయన తెలిపారు.

రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్‌కు సతీవియోగం


నివాళులర్పిస్తున్న రాజశేఖర్‌బాబు (అంతరచిత్రంలో) ఇందిరాదేవి (ఫైల్)

బాపట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు భార్య ఇందిరాదేవి (65) మృతి చెందారు. ఆమె మృతి గురించి తెలుసుకున్న పలువురు ప్రముఖులు భౌతికకాయాన్ని సందర్శించి పుష్పాంజలి ఘటించారు. బాపట్ల అర్బన్‌డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు పార్టీశ్రేణులతో కలిసి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అదేవిధంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి, వివిధ శాఖల అధికారులు, రెడ్‌క్రాస్ సభ్యులు ఆమె మృతికి సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

బాపట్లరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. బాపట్ల మండలం ముత్తాయపాలేనికి చెందిన ఓ వృద్ధురాలు తన ఇంట్లో పనిచేసుకుంటూ కాలుజారి కిందపడటంతో తలకు తీవ్రగాయమైంది. కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బాపట్ల రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


బ్రహ్మ నాయుడు విగ్రహం



మినీ మహాభారతం

- పోతుగడ్డలో పారిన వీరుల రక్తం
- యుద్ధభూమిలో ఆయుధ పూజ
- 30 నుంచి వీరారాధనోత్సవాలు

ద్వాపరయుగంనాటి మహాభారతాన్ని తలపించేది పల్నాటి యుద్ధం. ఈ యుద్ధంలో ఎందరో వీరులు పోరాడి అమరులయ్యారు. ఆనాటి యుద్ధంలో అశువులు బాసిన వీరుల గుండెచప్పుళ్లు ఇప్పటికీ వినబడుతూనే ఉన్నాయి. పదవీ వ్యామోహం, దాయాదుల వైరం, శైవ, వైష్ణవ సంఘర్షణల నేపథ్యంగా క్రీస్తు శకం 12వ శతాబ్దంలో పల్నాటి యుద్ధం జరిగింది. ఇక్కడ ఏటా జరిగే వీరారాధనోత్సవాల్లో కత్తులు నర్తిస్తాయి. పల్నాటి కథను హృద్యంగా ఆలపిస్తాయి, ఇక్కడ ఏ రాయిని చూసినా పల్నాటి పౌరుషం పలుకరిస్తుంది. ఆనాటి యుద్ధ విశేషాలను గుర్తు చేసుకుంటూ 900 ఏళ్లుగా ప్రతి ఏటా ఐదు రోజుల పాటు పల్నాటి వీరారాధనోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు.


నాయకురాలు నాగమ్మ విగ్రహం

పల్నాటి యుద్ధం

కారంపూడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 30 నుంచి వీరారాధనోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల నలుమూల నుంచి యాత్రికులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో ఇందుకు సంబంధించిన ఓ కథనం..

పల్నాటి యుద్ధానికి దారితీసిన పరిస్థితులు

పల్నాటి రాజ్యాన్ని అనుగురాజు పరిపాలిస్తున్న తరుణంలో ఒకసారి కారడవిలో నాగమ్మ ఆతిథ్యాన్ని స్వీకరించి సంతృప్తి చెందిన ఆయన, ఆమెకు కొంతకాలం రాజ్యాధికారం ఇవ్వడంతో పల్నాటి చరిత్రకు అంకురార్పణం జరిగింది. అనుగురాజు గతించి నలగామరాజు రాజుగా, బ్రహ్మనాయుడు మంత్రిగా పరిపాలనా బాధ్యతలు స్వీకరించిన సమయంలో తండ్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకోమని నాగమ్మ కోరడంతో విధిలేక నలగామరాజు నాగమ్మకు రాజ్యాధికారం అప్పగించాడు. నాగమ్మ తనకు ప్రాప్తించిన విశేష అధికారాలతో బ్రహ్మనాయుడును దోషిగా చిత్రీకరించి నలగామరాజు సోదరుడు మలిదేవరాజును కారాగారంలో వేయించింది. బ్రహ్మనాయుడు మలిదేవరాజును విడిపించి మాచర్లలో రాజ్యాన్ని ఏర్పాటు చేసి సుభిక్షంగా పాలన సాగించారు. దీంతో, కన్నుకుట్టిన నాగమ్మ, మాచర్ల రాజ్యాన్ని కైవసం చేసుకోవాలని కుయుక్తులు పన్నుతుంది. నాగమ్మ చెప్పుడు మాటలు విని నలగాముడు ఆమె చేతిలో కీలుబొమ్మ అవుతాడు. జూద వ్యసనుడైన బ్రహ్మనాయుడును కవ్వించి గురజాలకు పిలిపించింది. మలిదేవ, బ్రహ్మనాయుడులను కోడి పందేలు ఆడేలా కవ్వించి కుతంత్రంతో వారిని ఓడించి అడవులకు పంపుతుంది. నిర్ణీత కాలం తర్వాత రాజ్యాన్ని, బ్రహ్మనాయుడు చేసిన విజ్ఞప్తిని మన్నించక దూతగా వచ్చిన అలరాజును చంపిస్తుంది. దీంతో, ఆగ్రహోదగ్రుడైన బ్రహ్మనాయుడు యుద్ధం అనివార్యమని తలచి మలిదేవరాజు తరపున యుద్ధానికి దిగుతాడు. ఈ దాయాదులు యుద్ధభూమిగా కారంపూడిని ఎంచుకుని, పద్దెనిమిది రోజులు ఏకధాటిగా నాగులేటి ఒడ్డున పోరాటం చేస్తారు. ఈ పోరులో నాయకురాలు నాగమ్మ, బ్రహ్మనాయుడు చేతికి చిక్కగా స్త్రీ అనే కారణంగా ప్రాణభిక్ష పెట్టడంతో ఆమె పారిపోతుంది. యోధాను యోధులైన వీరులందరూ మరణిస్తారు. కన్నమదాసు, బాలచంద్రుడు, మలిదేవరాజు యుద్ధంలో వీరమరణం చెందుతారు. దీంతో, విరక్తి చెందిన బ్రహ్మనాయుడు రాజ్యాన్ని నలగామరాజుకు అప్పగించి గుత్తికొండ బిలంకు తపస్సు చేసేందుకు వెళ్లడంతో పల్నాటి యుద్ధం ముగుస్తుంది.



రక్తం కలిపిన అన్నపు ముద్దలు..

ఈ ఉత్సవాల్లో చివరిరోజైన 'కల్లిపాడు'ను రక్తం కలిపిన అన్నపు ముద్దలు పోతురాజు గుట్ట వద్ద ఆకాశంలోకి పీఠాధిపతి విసిరివేస్తారు. ఆ ముద్దలు శక్తులు (వీరులు) స్వీకరిస్తాయని నమ్మకం. ఈ తంతు ఆ నాటి నుం చి నేటి వరకు ఆనవాయితీగా వస్తోంది. నాడు వీరనాయకులు వాడిన ఆయుధాలను నాగులేటిలో స్నానమాచరింపజేసి అలంకరించి ఊరేగిస్తారు. బ్రహ్మన్న (పీఠాధిపతి) ఇచ్చిన తీర్థం తీసుకొని ఆ కొణతములు పోతురాజు గుట్టపై ఒరగడంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి.

ఐదురోజులు వీరారాధనోత్సవాలు

ఈ నెల 30 నుంచి వీరారాధనోత్సవాలు ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు 30న 'రాచగావు', డిసెంబరు 1న 'రాయబారం', 2న 'మందపోరు', 3న 'కోడిపోరు', 4న 'కల్లిపాడు'తో ఈ ఉత్సవాలు ముగుస్తాయి. ప్రధానంగా పద్నాలుగు జిల్లాల నుంచి శిష్యులు, కన్నమనీయులు, పిన్నమనీయులు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. ఆనాడు బ్రహ్మనాయుడు గుత్తికొండ బిలానికి వెళ్తూ యుద్ధంలో మరణించిన వీరులకు ఉత్సవాలు నిర్వహించడానికి వీరాచార పీఠం ఏర్పరిచి పిడుగు వంశీయులైన బ్రాహ్మణులను పీఠాధిపతులుగా నియమించారు. వంశపారపర్యంగా వస్తున్న ఈ పీఠాధిపత్యంతో ఈ ఉత్సవాలను యువకుడు పిడుగు తరుణ్ చెన్నకేశవ అయ్య వారు నిర్వహిస్తారు. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు, పీఠం నిర్వాహకుడు విజయకుమార్‌లు పర్యవేక్షిస్తున్నారు.


పల్నాటి వీరుల ఆయుధాలు


యుద్ధభూమిలో దక్షిణం వైపున నిర్మించిన వీరుల సేవా స్థలం

బీచ్‌వాలీబాల్ పోటీలలో.. గుంటూరు జిల్లా ప్రతిభ

బాపట్ల రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల సూర్యలంక తీరంలో రెండురోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి పాఠశాలల బీచ్‌వాలీబాల్ టోర్నమెంట్ సెలక్షన్స్ బుధవారంతో ముగిశాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్నిజిల్లాలు నుంచి అండర్-14,17,19 సంవత్సరాల బాల బాలికల జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా జరిగిన ఈపోటీలలో అండర్-19 బాలికల విభాగంలో కృష్ణాజిల్లా, విజయనగరం జిల్లాలు ప్రథమ,ద్వితీయ స్థానాలు సాధించాయి. అండర్-19 బాలుర విభాగంలో ఈస్ట్ గోదావరి ప్రథమస్థానం, కృష్ణాజిల్లా ద్వితీయ స్థానం, అండర్-17 బాలికల విభాగంలో కడప ప్రథమ స్థానం, గుంటూరు ద్వితీయ స్థానం, అండర్-17 బాలుర విభాగంలో గుంటూరు ప్రథమస్థానం, శ్రీకాకుళం ద్వితీయ స్థానం, అండర్ -14 బాలుర విభాగంలో గుంటూరు జిల్లా ప్రథమ స్థానం, కర్నూలు జిల్లా ద్వితీయ స్థానం, అండర్-14బాలికల విభాగంలో కడప ప్రథమస్థానం, గుంటూరు ద్వితీయ స్థానం సాధించాయి. గెలుపొందిన విద్యార్థులకు జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం, గుంటూరుజోన్ ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరి ఎస్‌కె.కరిముల్లాలు బహుమతులు, సర్టిఫికెట్‌లు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రబీచ్ వాలీబాల్‌జట్లు ఇక్కడ ఎంపిక చేయటం జరిగింది. వీరు డిసెంబరు నెలలో జాతీయస్థాయి పోటీలు ఒరిస్సా రాష్ట్రంలోని పూరిలో జరుగు పోటీలలో పాల్గొంటారని సెక్రటరి ఎస్‌కె.కరిముల్లా తెలిపారు.


బీచ్‌వాలీబాల్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లు, బహుమతులను అందజేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం తదితరులు

ఏపీలో వ్యవసాయ పరిశోధనలను ప్రోత్సహించండి: ఎంపీ లావు

న్యూఢిల్లీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ పరిశోధనలను ప్రోత్సహించాలని టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. బుధవారం వ్యవసాయానికి సంబంధించిన పలు అంశాలను ఆయన పార్లమెంట్ దృష్టికి తీసుకొచ్చారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి పుట్టినిల్లు అయిన ఆంధ్రప్రదేశ్‌లో లోతైన వ్యవసాయ పరిశోధనలకు పెట్టుబడులు పెట్టాలని కేంద్రానికి ప్రతిపాదించారు. వ్యవసాయంలో వినూత్న పద్ధతులు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అధిక దిగుబడి ఇస్తున్న పంటల్లో సూక్ష్మపోషక సాంద్రత గణనీయంగా తగ్గుతుందని తేలిందని, దీనిని దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన పంట దిగుబడిని ప్రోత్సహించాలన్నారు.

దారి దోపిడీ దొంగలకు ఐదేళ్ల జైలు, జరిమానా

యడ్లపాడు, నరసరావుపేట లీగల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండల పరిధిలో దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురు దొంగలకు ఐదేళ్ళ జైలు శిక్ష విధిస్తూ నరసరావుపేట జిల్లా కోర్టు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎ పూర్ణిమ బుధవారం తీర్పునిచ్చారు. ఎస్‌ఐ వి బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... 2021 డిసెంబరు 6న లింగారావుపాలెం ఎస్సీ కాలనీకి చెందిన మద్దు వీరయ్య, ప్రసన్న దంపతులు గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతున్న బంధువులను పరామర్శించి రాత్రి 8.30 గంటల సమయంలో గ్రామానికి వస్తుండగా బోయపాలెం-లింగారావుపాలెం మార్గంలోని చెరువు సమీపంలో గుర్తు తెలియని దుండగులు కర్రలతో దాడిచేసి వారివద్ద 3.5గ్రాముల బంగారం, రూ.2,300 నగదు, సెల్‌ఫోన్‌ను లాక్కుని వదిలివేశారు. మరి కొంత సమయానికి అదే కాలనీకి చెందిన మద్దు అంకమ్మ, నర్సమ్మలు రాగా వారిపై కూడా దాడిచేసి సెల్‌ఫోన్, చెవి కమ్మలు, జూకాలు, గొలుసు లాక్కుని తీవ్రంగా కొట్టారు. సంఘటన జరిగిన మరుసటి రోజు రాత్రి 9 గంటల సమయంలో చెంఘీజ్‌ఖాన్‌పేట-సొలస మార్గంలో ద్విచక్రవాహనంపై కుమారుడు ధనుష్‌తో కలసి వెళుతున్న సాగి నాగమ్మలను ముసుగులు వేసుకున్న దుండగులు కర్రలతో దాడిచేసి పొలంలోకి లాక్కెళ్ళి వారి వద్ద ఉన్న 3.75 సవర్ల బంగారు గొలుసు చెవి పోగులు, ఉంగరం, వెండి పట్టీలు లాక్కున్నారు. కొద్ది సేపటికే అదే గ్రామానికి చెందిన పొనుగుబాటి వీరాంజనేయులు తాళ్లూరిలోని ఉంటున్న తన అత్త గోరంట్ల అంజమ్మను ద్విచక్రవాహనంపై తీసుకుని వస్తుండగా అతనిపై కూడా దాడిచేసిన దుండగులు సెల్‌ఫోన్, రూ.1,500 నగదు, అంజమ్మ వద్ద ఉన్న చెవి కమ్మలు, ముక్కుపుడక లాక్కున్నారు. అప్పట్లో ఈ సంఘటనలు సంచలనం కలిగించాయి. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో నిందితులైన నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు గ్రామానికి చెందిన ఆకుల లింగమయ్య, ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం అమ్మవరం గ్రామానికి చెందిన దాసరి ఓబులేసు, నంద్యాలకు చెందిన చిన్న ఇండ్ల రమణయ్యతో పాటు మరో ఐదుగురిని అరెస్టు చేశారు. వారిపై కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. బెయిల్‌పై వెళ్లిన వారిలో ఐదుగురు నిందితులు పరారీలో ఉన్నారు. మిగతా ముగ్గురు నిందితులకు గతంలో ఓ కేసులో 20 సంవత్సరాలు శిక్ష పడింది. వారు ప్రస్తుతం నెల్లూరు జిల్లా జైల్లో ఉన్నారు. వారిపైనే పై రెండు నేరాలు కూడా రుజువ్వడంతో ఒక్కొక్క కేసులో ఒక్కొక్కరికి ఐదు సంవత్సరాలు శిక్ష మొత్తాన్ని ఏకకాలంలో అనుభవించేలా న్యాయాధికారి తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ ఏపీపీ బుచ్చిదంతాచారి నిర్వహించారు. దోపిడీలకు పాల్పడిన వారంతా వలస కూలీలుగా యడ్లపాడు మండలానికి వచ్చి పగలు పనులకు వెళ్ళేవారని, రాత్రిళ్ళు దోపిడీలకు పాల్పడే వారని ఎస్‌ఐ వివరించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో రేణుకకు బంగారు పతకం

పోటాపోటీగా అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలు


క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ఏఎన్‌యూ వీసీ గంగాధరరావు

పెదకాకాని, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరుగుతున్న సౌత్ వెస్ట్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీలో వర్సిటీ విద్యార్థిని రేణుక బంగారు పతకం సాధించింది. బుధవారం జరిగిన పోటీల్లో 76 కేజీల విభాగంలో మొత్తం 205 కేజీలు బరువు ఎత్తి రేణుక ప్రథమ స్థానంలో నిలిచినట్లు పోటీల నిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ వీపీఎస్ పాల్‌కుమార్ తెలిపారు. 71 కేజీల విభాగంలో ఆంధ్ర యూనివర్సిటీ క్రీడాకారిణి సనపత్తి పల్లవి బంగారు, ఏఎన్‌యూ విద్యార్థిని బి.నాని వెండి, మంగళూరు యూనివర్సిటీ క్రీడాకారిణి ఎం.తనుషా కాంస్య పతకాల్ని పొందారు. 64 కేజీల విభాగంలో భారతీ విద్యాపీట్ యూనివర్సిటీకి చెందిన కామ్ ట్రీ హిమాలినగేష్ బంగారు, శివాజీ యూనివర్సిటీ క్రీడాకారిణి మోహితే భూమిక రాజేంద్ర వెండి, అన్నామలై యూనివర్సిటీ విద్యార్థిని కౌశికల్ కాంస్య పతకాల్ని కైవసం చేసుకున్నారు. 59 కేజీల విభాగంలో భారతీ విద్యాపీట్ యూనివర్సిటీకి చెందిన క్రీడాకారిణి సాక్షిరమాలే బంగారు, భారతీయార్ యూనివర్సిటీ క్రీడాకారిణి కనికశ్రీ వి.ఆర్ వెండి, జేఎన్టీయూ కాకినాడ క్రీడాకారిణి కందుకూరి హైమావతి కాంస్య పతకాల్ని సాధించినట్లు పాల్ కుమార్ తెలిపారు. వర్సిటీ వీసీ, పోటీల నిర్వాహక కమిటీ చైర్మన్ ఆచార్య కే. గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం పతకాలు పొందిన క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ టీం చీఫ్ బడేటి వెంకట్రామయ్య, అధ్యాపకులు డాక్టర్ డి.సూర్యనారాయణ, డాక్టర్ యిన్నయ్య, డాక్టర్ రామ్మోహనరావు లు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌గా నంద

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో న్యాయ విభాగంలో అతిథి అధ్యాపకురాలిగా పనిచేస్తున్న పర్చూరు కుమారి నంద సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీలో బంగారు పతకం సాధించారు. బుధవారం ఆమెను వీసీ ఆచార్య కె.గంగాధరరావు అభినందించారు. నేషనల్ ఈవెంట్‌లో కూడా రాణించి మరిన్ని పతకాలు సాధించాలని రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం ఆమెకి శుభాకాంక్షలు తెలిపారు. న్యాయవిభాగాధిపతి ప్రొఫెసర్ ఎల్. జయశ్రీ, అతిథి అధ్యాపకులు డాక్టర్ ఎస్.సతీష్, ఎస్ చంద్రశేఖర్, డాక్టర్ సురేష్ చెన్నం, డాక్టర్ పి.శివరాం, చెన్నారావు, డాక్టర్ జ్యోతి సంపూర్ణ, అభిషేక్, డాక్టర్ పి.వెంకటరమణ, డాక్టర్ ఎన్ రాధిక, డాక్టర్ కిషోర్, డాక్టర్ జి.సతీష్‌కుమార్, శ్రీరామ్ తదితరులు ఈ అభినందన కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాధే బరువాయే

నారు పోసిన వాడు నీరు పోయక పోతాడా అన్న ధీమా గుంటూరు ప్రభుత్వాసుపత్రి సిబ్బందిలో కనిపిస్తుంది. అసలే ప్రాణం ఉంటుందో పోతుందో అన్న బాధలో ఆసుపత్రికి వచ్చే వారికి అక్కడ మరిన్ని బాధలు తప్పడం లేదు. అయిన వారిని కాపాడుకునేందుకు రక్త సంబంధీకులే స్ట్రక్చర్‌లను నెట్టుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఆసుపత్రిలో చేరిన తరువాత కూడా ఆ పరీక్ష ఈ పరీక్ష అంటూ వార్డులకు తీసుకు వెళ్లేందుకు బంధువులే ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అక్కడ ఉన్న వార్డు బాయ్‌లు ఏమయ్యారో.. ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి.

-(గుంటూరు, ఆంధ్రజ్యోతి)



నేటి వరకే క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకారం

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ సమ్మరి రివిజన్-2025లో భాగంగా సాధారణ ఓటర్లు తమ క్లెయిమ్‌లు, అభ్యంతరాలను ఈ నెల 28వ తేదీ సాయంత్రం వరకు దాఖలు చేయొచ్చని ఈఆర్‌వో ఎస్‌ఎస్‌కే కాజావలి తెలిపారు. గత నెల 29వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాని ప్రచురించడం జరిగిందని, ఆ రోజు నుంచే క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తున్నామ న్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కలిపి దాదాపుగా 15 వేల దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిష్కరిస్తున్నా మన్నారు. ఈ నెల 16, 17, 23, 24 తేదీల్లో అన్ని పోలింగ్ బూత్‌లలో బీఎల్‌వోల ద్వారా స్పెషల్ క్యాంపెయిన్ డేలను కూడా నిర్వహించామని చెప్పారు. గురువారం సాయంత్రం వరకు దాఖలైన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను డిసెంబరు 24వ తేదీ లోపు పరిష్కరించి ఓటర్ల జాబితాను ఆరోగ్యవంతంగా రూపొందిస్తామని పేర్కొన్నారు. తుది ఓటర్ల జాబితా 2025 జనవరి 6వ తేదీన ప్రచురించడం జరుగుతుందన్నారు. దీని దృష్ట్యా ఇంకా ఎవరైనా క్లెయిమ్‌లు పెట్టుకోదలచిన వారు గురువారం సాయంత్రం లోపు దాఖలు చేసుకోవచ్చని సూచించారు. ఇది సాధారణ ఓటర్లకు సంబంధించిన ప్రక్రియ అని, దీనికి పట్టభద్రుల ఓటర్ల క్లెయిమ్‌లకు సంబంధం లేదన్నారు.

అడుగడుగునా.. వసూళ్లు

మిర్చి ఎగుమతిదారులు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చియార్డు)కు ప్రత్యామ్నాయం చూసుకొంటున్నారు. హమాలీలు మొదలుకొని లారీ యజమానుల వరకు సిండికేట్లుగా మారి అలవికాని ఛార్జీలు వసూలు చేస్తుండటమే ఇందుకు మూల కారణం. ఇప్పటికే కొంతమంది ఎక్స్‌పోర్టర్లు తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం మార్కెట్‌కి వెళ్లి అక్కడ మిర్చిని కొనుగోలు చేసి ఎగుమతి చేస్తున్నారు. మరికొందరు పల్నాడు జిల్లాలోని దాచేపల్లి ఏఎంసీకి వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. దీని వలన ఇప్పటికిప్పుడు మార్కెట్ కమిటీ ఆదాయంలో వ్యత్యాసం పెద్దగా కనిపించకపోయినా దీర్ఘకాలంలో భారీగానే రాబడికి చిల్లు పడుతుందన్న అభిప్రాయం వ్యకమవుతున్నది. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ అధికారులు తేరుకోకపోతే ఆ తర్వాత చర్యలు తీసుకొన్నా ఎలాంటి ఉపయోగం ఉండదు.

- మిర్చి ఎగుమతిదారుల పక్కచూపులు
- గుంటూరు యార్డులో సిండికేట్‌లతో వేగలేకే ప్రత్యామ్నాయం
- ఖమ్మం, దాచేపల్లి యార్డుల్లో కొనుగోళ్లపై ఆసక్తి
- ఇదే పరిస్థితి కొనసాగితే జీఏంసీ ఆదాయానికి గండి పడినట్లే

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి): మిర్చి ఎక్స్‌పోర్టింగ్‌కు మిర్చియార్డు పెట్టింది పేరు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా మిర్చి పండికే కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి నుంచి కూడా రైతులు ఇక్కడికే వస్తుంటారు. ఇందుకు కారణం సరుకు అమ్ముడవగానే పైకం చేతిలో పడుతుంది. గతంలో పెద్దగా కూలీ ఛార్జీలు లేకపోవడం వలన ధర కూడా రైతుకు గిట్టుబాటు అయ్యేది. అయితే కాలక్రమంలో ఇక్కడ ప్రతీ వ్యవస్థలో సిండికేట్లు పుట్టుకొచ్చాయి. దొడ్డి కాపలా, కాటాలు, మచ్చు, లారీలోకి టిక్కీలు లోడింగ్ చేసి మోకులు కట్టినందుకు మరే ఇతర మార్కెట్లలో లేని ఛార్జీలను ఇక్కడ వసూలు చేస్తున్నారు. ఇవి చాలదన్నట్లుగా గుమాస్తా మామూళ్లు ఉండనే ఉన్నాయి. ఇవన్ని రైతు తీసుకొచ్చిన మిర్చికి ఎక్కువ ధర పెట్టి కొనుగోలు చేయకుండా ఎగుమతిదారులకు ప్రతిబంధకాలుగా మారాయి. ఇక లారీ రవాణ ఛార్జీలు కూడా ఇతర ప్రాంతాలతో పోల్చితే చాలా ఎక్కువ. ఒక మిర్చి టిక్కీ కాటా వేసినందుకు దాదాపుగా రూ. 5కి ఛార్జీ పెంచమని వేమెన్‌ల సిండికేట్ కోరుతున్నది. లారీకి మిర్చి టిక్కీలు ఎత్తి మోకులు కట్టినందుకు దాదాపుగా రూ. 6 వేలకు పైగా వసూలు చేస్తున్నారు. అయితే ఈ పనిని సక్రమంగా చేయడం లేదు. లారీ హైవే మీదకు వెళ్లిన తర్వాత అక్కడ తిరిగి మోకులను బిగించాల్సి వస్తున్నది. ఇందుకు దాదాపుగా రూ. 1500లకు పైగా ఖర్చు అవుతున్నది.

దొడ్డి కాపలా, దిగుమతి, ఎగుమతి కూలీలు కూడా మోయలేని భారంగా మారాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. మచ్చుకాయల రూపంలో ఒక్కో లాట్ నుంచి కేజీకి పైగానే మిరపకాయలను తీసుకొంటున్నారు. ఒక లారీ ఎక్స్‌పోర్టింగ్‌కు పెడితే ఎగుమతిదారుడి గుమాస్తా మామూలు కింద రూ. 3 వేలకు పైగా వసూలు చేస్తున్నారు. ఇవ్వకపోతే బిల్లులు కొట్టకుండా జాప్యం చేస్తున్నారు. అలానే మిర్చియార్డులో సూపర్‌వైజర్ల మామూళ్లు బహిరంగ రహస్యమే. ఇలా చూసుకొంటే సిండికేట్ల కారణంగా ఒక లారీని ఇక్కడి నుంచి ఎగుమతి చేస్తే ఇతర మార్కెట్లతో పోల్చితే దాదాపుగా రూ. 30 వేలకు పైగా వ్యత్యాసం వస్తున్నదని ఎక్స్‌పోర్టర్స్ చెబుతున్నారు. దీని వలనే తాము ఖమ్మం, దాచేపల్లి మార్కెట్ కమిటీల్లో మిర్చి కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. దాచేపల్లి ఏఎంసీ నుంచే ఈ ఏడాది 6 లక్షలకు పైగా మిర్చి టిక్కీలు ఎగుమతి అయినట్లు వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. ఖమ్మం మార్కెట్ నుంచి 20 లక్షలకు పైగా టిక్కీలు ఎగుమతి అయ్యాయని తెలిపాయి. దీనివలన గుంటూరు యార్డుకు రావాల్సిన ఆదాయానికి క్రమక్రమంగా గండి పడటం ప్రారంభించింది. ఈ కారణంగానే మిర్చియార్డు ఆదాయం ఏటా రూ. 100 కోట్ల మార్కెట్ ఫీజుకు మించడం లేదు. వాస్తవానికి ఇంతకంటే కనీసం మరో 40 శాతం పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా సిండికేట్ల కారణంగా గండి పడుతున్నది. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ అధికారులు మిర్చి ఎగుమతులకు అనుకూలమైన వాతావరణం కల్పించకపోతే పరిస్థితి చేయి దాటిపోయే ప్రమాదం లేకపోలేదు. ఇవేకాకుండా కొంతమంది కమీషన్ వ్యాపారస్తులు ఎగుమతిదారులకు నమ్మకంగా కుచ్చుటోపీ పెడుతుండటంతో ఈ మోసాలతో వేగలేమని వేరేదారులు వెతుక్కొంటున్నారు.





కార్తీక్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయసిబ్బంది

షూటింగ్ బాల్‌లో గౌతమి విద్యార్థుల విజయం

ఇంకొల్లు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అనంతపురంలో ఈ నెల 23,24,25 తేదీలలో జరిగిన 43వ రాష్ట్ర స్థాయి యు-19 బాలబాలిక షూటింగ్ బాల్ పోటీలలో ఇంకొల్లుకు చెందిన గౌతమి విద్యార్థులు విజయం సాధించారు. గుంటూరు జిల్లా జట్టుపై బాపట్ల జిల్లా జట్టు విజయం సాధించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతిని కైవసం చేసుకోగా, బాపట్ల జట్టు విజయం సాధించడానికి ఇంకొల్లు గౌతమి విద్యార్థి కే కార్తీక్ కారణం కాగా, బుధవారం జరిగిన అభినందన సభలో కార్తీక్‌కు పాఠశాల చైర్మన్ వెంకటేశ్వరరావు, డైరెక్టరు కాట్రగడ్డ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

1న కార్తీక అమావాస్య పూజలు



వేటపాలెం(చీరాల), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రామన్నపేట పంచాయతీ పరిధిలో వేంచేసిఉన్న శ్రీ కనక నాగవరప మ్మ అమ్మవారి దేవస్థానంలో వచ్చే నెల 1వ తేదీ ఆదివారం అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పోతిని శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారి కృపకు పా త్రులు కావాలని ఆయన కోరారు.

నేడు కార్తీక వన సమారాధన

బల్లికురువ : మండలంలోని అంబడపూ డి దుర్గా మల్లేశ్వర స్వామి దేవాలయంలో గురువారం కార్తీక మాసాన్ని పురస్కరించుకొని కార్తీక వన సమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా దేవాలయంలో ప్ర త్యేక పూజలు, వనభోజన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

టీడీపీలోకి పలు పార్టీల నాయకులు

» కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యాలయంలో బుధవారం పలు పార్టీలకు చెందిన నాయకులు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరారు. వారి మెడలో టీడీపీ కండువాలు వేసి ఎమ్మెల్యే వారిని టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి నుంచి టీడీపీలో ఉన్నామని తిరిగి సొంతింటికి వచ్చినట్లుగా ఉందని చెప్పారు. పార్టీలో చేరిన వారిలో వైసీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు గుంటూరు మాధవరావు, మల్లి రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీకి చెందిన డీ సైమన్, ఎం.అరుణ్ ఉన్నారు.

ఈ-పంట నమోదుపై తనిఖీలు

» జిల్లాలో ఎన్‌ఎస్‌వో బృందం పర్యటన

» పలుచోట్ల పంటల పరిశీలన



ఈపంటను నమోదు చేస్తున్న అధికారి

ఒంగోలు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ సీజన్ ఈ పంట నమోదు వాస్తవికతపై కేంద్ర ప్రభుత్వ సంస్థ బృందం తనిఖీలు జరుగుతున్నాయి. జాతీయ శాంపిల్ సర్వే సంస్థకు చెందిన నెల్లూరు, కడప కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్లు శ్రీనివాస్, రామకృష్ణలు జిల్లాలో ఇందుకోసం పర్యటిస్తున్నారు. బుధ, గురువారాలలో ఈ బృందం స్థానిక వ్యవసాయ ప్రణాళిక శాఖల అధికారులతో కలిసి మూడు మండలాలలోని పలు గ్రామాలలో పరిశీలన చేయాల్సి ఉంది. అందులో బుధవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏవో) సిహెచ్.శ్రీనివాసరావుతో కలిసి ముండ్లమూరు, త్రిపురాంతకం మండలాలలో పర్యటించి ఈ పంట నమోదు పరిశీలించారు. ప్రకృతి వైపరీత్యాలు సమయంలో నష్టపోయిన రైతులకు పరిహారం అందజేత ఇతర ప్రభుత్వ పథకాల లబ్ధిత ఎంపిక కోసం ఈ పంట నమోదు కీలకంగా మారిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు దీనిపై ప్రత్యేక దృష్టిపెట్టాయి.

ఓటీపీతో ఈకేవైసీ చేయాలి

నిబంధనల ప్రకారం ప్రతి రైతుకు చెందిన పొలంలో ఏ సర్వే నెంబరులో, ఏ పంట సాగు చేశారన్నది ఫొటోతో సహా వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలి. అనంతరం సదరు రైతు బయోమెట్రిక్ లేదా సెల్‌ఫోన్ నుంచి ఓటీపీ ద్వారా మిగతా ఈకేవైసీ చేయాలి. అలా జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 97.80శాతం చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు నివేదించారు. ఆ సీజన్‌లో 4.99 లక్షల ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణానికి సుమారు 3.93లక్షల ఎకరాలలో పంటలు సాగు చేయగా లక్షా 40వేల మంది రైతులకు చెందిన 3.85లక్షల ఎకరాలకు సంబంధించి ఈ పంట నమోదుతో పాటు ఈకేవైసీ కూడా చేశారు.

పరిశీలనకు అధికారులు

కాగా రాష్ట్రవ్యాప్తంగా ఈ పంట ఖచ్చితత్వ పరిశీలనను కేంద్రప్రభుత్వానికి చెందిన ఎన్ఎస్ఓ సంస్థ అధికారులు తనిఖీ చేస్తున్నారు. పంట సాగు చేసిన భూమిలో ఈ పంట నమోదు జరిగిందా లేదా, వేసిన పంటనే నమోదు చేశారా? లేక ఒక పంట వేస్తే మరొక పంట నమోదు చేశారా, అసలు పంట వేయకుండా వేసినట్లు నమోదు చేస్తున్నారా? అన్న అంశాలను వారు క్షుణ్ణంగా పరిశీలన చేస్తున్నారు. అందులోభాగంగా బుధవారం ముండ్లమూరు మండలం వేంపాడు, త్రిపురాంతకం మండలం రాజుపాలెం, త్రిపురాంతకం గ్రామాలలో ఈ పంట నమోదు పరిశీలించారు. గురువారం హెచ్ఎంపాడు మండలంలో పరిశీలించి సాయంత్రం ఒంగోలులో వ్యవసాయ, ప్రణాళికాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

రాత్రంతా తాలూకాలోనే..

» విజయ్‌పాల్‌ను గుంటూరు కోర్టులో హాజరు

» సాయుధ బలగాల భద్రత నడుమ తరలింపు

ఒంగోలు క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత సీఐడీ ఏఎస్పీ విజయ్‌పాల్‌ను అరెస్టు చేసిన ఎస్పీ దామోదర్ మంగళవారం రాత్రి ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌కు తరలించారు. రాత్రంతా అక్కడే ఉంచారు. ఉదయం విజయ్‌పాల్‌కు వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు నివేదిక ఇచ్చారు. దీంతో గుంటూరు సీఐడీ కోర్టుకు తరలించేందుకు అంతా సిద్ధం చేశారు. తరువాత మధ్యాహ్నం 2.30 తర్వాత తాలూకా సీఐ అజయ్‌కుమార్ నేతృత్వంలో పటిష్ట భద్రత నడుమ ఎస్పీ కార్యాలయానికి తీసుకువెళ్లారు. అక్కడ 11 పేజీల రిమాండ్ రిపోర్టును ఎస్పీ అందజేయగా, 2.45కు గుంటూరుకు బయలుదేరారు. ఒక సీఐ, ఎస్ఐ, ఆర్ఎస్ఐతోపాటు పది మంది సిబ్బంది ఉన్నారు. ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు ఆయుధాలతో ఉన్నారు.

స్టేషన్‌లో చాప, దుప్పటి

విజయ్‌పాల్‌ను మంగళవారం రాత్రి తొమ్మిది గంటలకు అరెస్టు చేసిన తరువాత ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌కు తరలించిన విషయం తెలిసిందే. అక్కడ మొదటి అంతస్తులోని గదిలో పడుకునేందుకు చాప, దుప్పటి, దిండు ఇచ్చారు. భద్రత కోసం ఆరుగురు పోలీసులను నియమించారు. పోలీసు అధికారులు రాత్రి తనిఖీలు నిర్వహించారు. బుధవారం విజయ్‌పాల్‌కు సాధారణ భోజనం ఏర్పాటు చేశారు. ఆయన తన వెంట నిత్యం వినియోగించుకునే మందులు, అదనంగా దుస్తులు ఓ బ్యాగ్‌లో తెచ్చుకున్నారు. గుంటూరు కోర్టులో సాయంత్రం హాజరుపరచగా అక్కడ విజయ్‌పాల్ రిమాండ్ పై వాదనలు జరిగాయి. అనంతరం న్యాయాధికారి వచ్చేనెల 10 వరకు రిమాండ్ విధించారు.

మిర్చిపై తగ్గిన మక్కువ

» వరుస నష్టాలే కారణం

» పెరిగిన పెట్టుబడి, తగ్గిన ధరలతో వెనక్కి

» పొగాకు సాగుపై దృష్టి సారించిన రైతులు

ఇంకొల్లు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు ప్రాంతంలో గత రెండేళ్లుగా మిర్చి సాగు తగ్గింది. గతంలో ఎటుచూసినా పొలాల్లో మిర్చి కనిపించేది. రైతులు నష్టాలను చవిచూడడంతో మిర్చి సాగుకు దూరమవుతున్నారు. మిర్చి రైతులు శీతల గిడ్డంగులలో నిల్వ ఉంచినప్పటికీ గిట్టుబాటు ధర రాకపోవడంతో ఈ ఏడాది మిర్చి సాగుపై రైతుకు ఆసక్తి తగ్గింది. పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా ధరలు లేకపోవడం ప్రధానకారణమైతే మరోవైపు పెట్టిన పెట్టుబడులకు తగ్గట్టుగా దిగుబడులు రాకపోవడంతో రైతులకు మిర్చి సాగుపై ఆసక్తి తగ్గింది. దీంతో గత ఏడాది పొగాకుకు అంతర్జాతీయంగా మంచి రేటు ఉండడంతో పొగాకు సాగు చేశారు. మంచి లాభాలు పొందారు. అదే ఆలోచనతో ఈ ఏడాది కూడా మిర్చికి ప్రత్యామ్నాయంగా పొగాకు సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కానీ అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలలో ఒడిదొడుకులు ఉండడంతో మండలంలో వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టి పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచనలు చేస్తున్నప్పటికీ రైతులు పొగాకుపై మగ్గు చూపుతున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది పొగాకు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం కనబడుతోంది.



విస్తారంగా సాగులో ఉన్న పొగాకు

అక్కడక్కడా కన్పిస్తున్న మిర్చి



మ్మవరంలోని సాగులో ఉన్న మల్లె తోటలు

మల్లె వాసన కరువే..!

» కనుమరుగవుతున్న సాగు

» కూలీల కొరత, గిట్టుబాటు ధరలు లేక దూరమవుతున్న రైతులు

» నాడు 200 ఎకరాల్లో .. నేడు 20 ఎకరాలకే పరిమితమైన తోటలు

మేదరమెట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అందరికీ సువాసన పంచే మల్లెలు.. రైతులకు మాత్రం లాభాలను పండించలేకపోయాయి. అన్ని శుభ కార్యాల్లో మహిళలు ఎంతో మక్కువతో ధరించే మల్లెలు క్రమేపీ ఈ ప్రాంత కరువవుతున్నాయి. మండలంలోని మల్లె సాగు క్రమేణా కనుమరుగు అవుతున్నది. గుండ్లకమ్మ రిజర్వాయర్ నిర్మించక ముందు సుమారు 300 ఎకరాలకు పైగా మల్లె తోటలు సాగు అయ్యేవి. రిజర్వాయర్ నిర్మాణంతో కొంత భూమి ముంపులో పోగా అందులో మల్లెతోటలు కూడా ఉన్నాయి. ఒక్క తమ్మవరం గ్రామంలో దాదాపు 200 ఎకరాలకు పైగా మల్లె తోటలు సాగులో ఉండేవి. ప్రస్తుతం 20ఎకరాల లోపే మల్లె తోటలు సాగులో ఉన్నాయి. ఐదారు సంవత్సరాల నుంచి క్రమేపీ మల్లె సాగును రైతులు తగ్గించుకొని వస్తున్నారు. ఉదయానే మల్లె పూలు కోయడానికి కూలీలు దొరకకపోవడం, అధికంగా పురుగు మందులకు ఖర్చులు పెరగడం, సాగులో ఉన్న మల్లె రకాలు ఎక్కువ సంవత్సరాలు పూలు పండకపోవడం వంటి కారణాలతో రైతులు మల్లె సాగుకు దూరం అవుతున్నారు. వీటి అన్నింటికన్నా దళారులు, మార్కెట్ మాయజాలంతో గిట్టుబాటు ధర లేకపోవడం, దళారులు రైతులకు సొమ్ము ఎగ్గొట్టడం మరో ప్రధాన కారణం. తమ్మవరం చుట్టుపక్కల వివిధ రకాల పరిశ్రమలు రావడం, పెద్ద ఎత్తున గిడ్డంగులు నిర్మించడంతో భూమి పూర్తిగా తగ్గిపోయింది. ఉన్న కొద్దిపాటి భూమిలో రైతులు పాడి సాగుకే మొగ్గు చూపుతున్నారు. భవిష్యత్‌లో ఈ ప్రాంతంలో మల్లె తోటలు కన్పించవని రైతులు అంటున్నారు.

క్రీస్తు శాంతిసందేశం అందరికీ అనుసరణీయం

ఎమ్మెల్యే కొండయ్య



సెమీ క్రిస్మస్ వేడుకలో ఎమ్మెల్యే కొండయ్యను సన్మానిస్తున్న పోలీసులు

చీరాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఏసు క్రీస్తు శాంతిసందేశం అందరికీ అనుసరణీయమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. గడియార స్తంభం సెంటర్ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన కమ్యూనిటీ క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదిన వేడుకల్లో భాగంగా నిర్వహించే సెమీ క్రిస్మస్ వేడుకలు ఐకమత్యం, స్నేహానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ క్రీస్తు చెప్పిన మాటలు ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. శాంతి, ప్రేమతత్వంను ప్రతి ఒక్క రూ అవవర్చుకోవాలన్నారు. పాస్టర్లు క్రీస్తు సువార్త సందేశాన్ని బోధించారు. కొవ్వొత్తులను వెలిగించి క్యాండిల్ సర్వీస్ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, కూటమి నాయకులు, పలువురు ప్రముఖులు, ఆరాధకులు పాల్గొన్నారు.

ఎద్దును చంపిన పెద్దపులి

భయాందోళనలో ప్రజలు



ఎద్దు కళేబరాన్ని పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

కంభం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అర్ధవీడు మండలం వెలగలపాయ సమీపంలోని నల్లమల అడవిలో మేతకు వెళ్లిన ఎద్దుపై పెద్దపులి దాడి చేసి చంపిందని ఫారెస్టు బీట్ ఆఫీసర్ రాజేష్ తెలిపారు. ఫారెస్టు అధికారి రాజేష్ కథనం ప్రకారం, వెలగలపాయ గ్రామానికి చెందిన చెల్లె వెంకట్రావు అనే రైతు సోమవారం తన రెండు ఎద్దులను సమీపంలోని అడవిలోకి మేతకు వదిలాడు. అయితే సాయంత్రానికి రెండు ఎద్దులో ఒక ఎద్దు మాత్రమే ఇంటికి వచ్చింది. రెండో ఎద్దు రాకపోవడంతో మంగళవారం ఉదయం వెతుకుతూ అడవిలోకి వెళ్లాడు. ఉల్లాకులసెల కొండ ప్రాంతంలో ఎద్దు కళేబరం కనిపించింది. దీంతో రైతు వెంకట్రావు ఫారెస్టు బీటు అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వచ్చిన ఫారెస్టు అధికారులు రాజేష్, అబ్దుల్‌గఫార్, రంగారెడ్డిలు ఎద్దు కళేబరాన్ని పరిశీలించి పెద్దపులి దాడి చేసి చంపి ఉంటుందని భావించారు. నిర్ధారణ కోసం ఎద్దు ఆ ప్రాంతంలో కెమెరాలను అమర్చి వెళ్లారు. బుధవారం వచ్చి పరిశీలించగా మంగళవారం రాత్రి ఎద్దు కళేబరం వద్దకు వచ్చిన పెద్దపులి కెమెరాలో రికార్డు అయిందని గమనించారు. ఎద్దు విలువ రూ.80వేల వరకు ఉంటుందని రైతు పేర్కొన్నారు. ఫారెస్టు అధికారులు పంచనామా నిర్వహించి రైతుకు నష్ట పరిహారం అందేలా చూస్తామని తెలిపారు. ఇదే ప్రాంతంలో గతంలో రెండు ఎద్దులపై దాడి చేసిన చంపిన విషయం విదితమే. దీంతో పశువుల కాపరులు తమ పశువులను అడవిలోకి మేతకు వదిలేందుకు భయపడుతున్నారు.

రిజిస్ట్రేషన్లకు గండం

(5వ పేజీ తరువాయి)

సవాలక్ష కొర్రీలు పెట్టి వాటిని రిజిస్టర్ చేయకుండా ఆపుతున్నారు. అసైన్డ్, ఫారెస్టు ల్యాండు వంక రైతులు ఇచ్చిన భూములు పట్టాభూములైతేనే రిజిస్ట్రేషన్ చేస్తామని, అసైన్డ్ భూములు ఉంటే వాటిని చేయమని ఆపారు. కొంతమంది రైతులు పట్టా భూములతోపాటు అసైన్డ్, ఫారెస్టు, సైనికులకు ఇచ్చిన భూములను కూడా ల్యాండ్ పూలింగులో ఇచ్చారు. ఇప్పుడు ఆ వంక పెట్టి వాటి రిటర్నబుల్ ప్లాట్లను సీఆర్డీఏ అధికారులు ఆపేశారు. వాటితోపాటు పట్టా భూములు కూడా ఇచ్చి ఉంటే వాటిని కూడా ఆపేశారు. దీంతో రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చినా సీఆర్డీఏ అధికారుల తీరులో ఏమాత్రం మార్పు రాలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మూడేళ్లుగా కౌలు బకాయిలు

రాజధాని కోసం భూములిచ్చిన అసైన్డ్ రైతుల భూములపై సీఐడీ విచారణ పేరుతో గత ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగింది. అసైన్డ్ రైతుల భూములను నాట్ ట్యాలీడ్ జాబితాలో పెట్టింది. మొత్తం 1600 మంది రైతుల పొలాలను నాట్ ట్యాలీడ్ జాబితాలో పెట్టి 1300 మందికి క్లీన్ చిట్ ఇచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మిగిలిన 1300 మందికి క్లీన్‌చిట్ వస్తుందని, అందరితోపాటు తమకు కౌలు వస్తుందని భావించారు. కానీ అసైన్డ్ రైతుల ఆశ నిరాశగానే మిగిలింది. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు అవుతున్నా వారి భూములు ఇప్పటికీ నాట్ ట్యాలీడ్ జాబితాలోనే ఉన్నాయి. మూడేళ్లుగా కౌలు బకాయిలు అలానే ఉన్నాయి. దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న అసైన్డ్ రైతులు సీఆర్డీఏ అధికారుల తీరును నిరసిస్తున్నారు. సీఐడీ విచారణ పేరుతో కౌలు చెల్లించకుండా జాప్యం చేస్తున్న ప్రభుత్వ తీరుపైనా వారు ఆగ్రహంతో ఉన్నారు. మంత్రి నారాయణ, నారా లోకేశ్‌లను కలిసి తమ గోడు విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో టీడీపీకి చెందిన పలువురు రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్ల పంపిణీకి రూ.122.22 కోట్లు విడుదల

ఒంగోలు నగరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 2,86,034 మంది పింఛన్‌దారులకు ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్లను పంపిణీ చేసేందుకు రాష్ట్రప్రభుత్వం జిల్లాకు రూ.122,22,87000ను జిల్లాకు విడుదల చేసింది. డిసెంబర్ నెలకు పంపిణీ చేయాల్సిన పింఛన్ సొమ్మును డిసెంబర్ ఒకటో తేదీ సెలవు కావటంతో ఈనెల 30వ తేదీనే ఇవ్వనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ వసుంధర తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల నుంచే సచివాలయం సిబ్బంది పంపిణీని ప్రారంభిస్తారని ఆమె వివరించారు. నవంబరు నెలలో పంపిణీ చేసిన పింఛన్ సొమ్మును తీసుకోని 1283 మందికి ఈనెల 30న రెండు నెలలకు కలిపి అందజేస్తారని తెలిపారు.

శీనారెడ్డి చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

» అక్రమాలపై విచారణకు అంతా సిద్ధం

» డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో త్రిసభ్య కమిటీ ఏర్పాటు

» డ్వామా పీడీగా పనిచేసిన కాలంలో భారీగా అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదుల వెల్లువ

» ఎట్టకేలకు స్పందించిన ప్రభుత్వం

» విచారణ చేయాలని ఆదేశాలు

» ఇప్పటికే కొనసాగుతున్న విజిలెన్స్ ఎంక్వయిరీ

» లోకాయుక్తలోనూ నమోదైన కేసు

» తాజాగా కలెక్టర్‌కు మరికొన్ని ఫిర్యాదులు

డ్వామా పూర్వ పీడీ శీనారెడ్డి అక్రమాలను నిగ్గుతేల్చేందుకు సర్వం సిద్ధమైంది. అతని అవినీతి వ్యవహారాలపై విచారణ ప్రారంభం కానుంది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీగా గత వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన కె.శీనారెడ్డి ఆ సమయంలో చేసిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని కలెక్టర్ అన్సారియాకు ప్రభుత్వ ఉన్నతాధికారులు నుంచి ఆదేశాలు అందాయి. దీంతో డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో ముగ్గురు సీనియర్ అధికారులతో త్రిసభ్య కమిటీని విచారణ కోసం కలెక్టర్ నియమించారు.



ఒంగోలు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో వివిధ సంస్థలు, ప్రభుత్వ శాఖలలో అధికారులు, అధికార పార్టీ నేతలు కలిసి సాగించిన అవినీతి, అక్రమాలు ఒక్కొకటిగా వెలుగుచూస్తున్నాయి. ఇటీవల వైద్యశాఖ, డీసీసీబీలలో విచారణ జరగ్గా, ప్రస్తుతం డ్వామా వంతు వచ్చింది. సహకార శాఖకు చెందిన, జిల్లావాసి అయిన శీనారెడ్డి 2019-24 మధ్యకాలంలో దాదాపు నాలుగున్నరేళ్ల పాటు డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేశారు. అప్పట్లో వైసీపీ పెద్దలతో సన్నిహిత సంబంధాలు నెరపుతూ ఒకస్థాయి అధికార పార్టీ నేతలు, చివరకు కొందరు ఎమ్మెల్యేలను సైతం లెక్కపెట్టనంత స్థాయిలో శీనారెడ్డి వ్యవహరించారన్న విమర్శలు ఉన్నాయి. డ్వామాలో అంతా తానై ఇష్టారీతిన వ్యవహరించి భారీగా అవినీతి అక్రమాలకు పాల్పడటమే కాక ఒక వర్గం ఉద్యోగులు, సిబ్బందిని వేధింపులకు గురిచేశారన్న ఆరోపణలు పెద్ద ఎత్తున వచ్చాయి.

ప్రకాశం సజ్జల అంటూ..

సాధారణ ఎన్నికలకు ముందు ఆయనను ఎన్నికల కమిషన్ సూచనలతో బదిలీ చేయగా మళ్లీ వైసీపీ ప్రభుత్వమే వస్తుంది.. తానే మళ్లీ పీడీగా వస్తానంటూ డ్వామా కార్యాలయంలో డాంబికాలు కూడా పలికారన్న చర్చ సాగింది. అయితే అసెంబ్లీ ఎన్నికల ఓట్లు లెక్కింపు అనంతరం ప్రకాశం జిల్లా సజ్జలకు స్వాగతం అంటూ డ్వామా కార్యాలయం వద్ద కొందరు వెటకారంగా బ్యానర్లు కూడా కట్టిన పరిస్థితి. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలతో శీనారెడ్డి ఏ స్థాయిలో అంటకాగారన్నది ఆ ఘటన తేటతెల్లజేస్తుంది. ఆ విషయం అలా ఉంచితే డ్వామా పీడీగా పనిచేసిన కాలంలో కింది నుంచి పైస్థాయి వరకు భారీగా అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు బలంగా వినిపించాయి. ఉపాధి పనులలో పెద్దఎత్తున అవకతవకలు, అక్రమాలు జరిగినా, సోషల్ ఆడిట్ బృందాలు వాటిని గుర్తించినా సరే మండల స్థాయిలో నిర్వహించే ప్రజావేదికలలో వాటన్నింటిని రద్దుచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. పైగా అక్రమాలకు పాల్పడిన వారికి వెన్నుదన్నుగా నిలిచి తాను కూడా భారీగా లబ్ధిపొందారన్న విమర్శలు వెల్లువెత్తాయి.

సిబ్బందినీ వేధించేవారు

పనిలో పనిగా తనకు గిట్టని శాఖ సిబ్బందిని సస్పెన్షన్లు, డిస్మిస్ చేసి అనంతరం వారి నుంచి లబ్ధిపొంది తిరిగి పోస్టింగులు ఇవ్వడం చేసేవారని సమాచారం. ఇక తన హోదాకు మించి ఆఫీసు వాహనాలు వాడకం, రోస్టర్ పాటించకుండా నియామకాలు ఇతర అనేక అంశాలలో పెద్దఎత్తున అరాచకాలు చేశారని తెలిసింది. కాగా ప్రభుత్వం మారిన తరువాత ఈ అంశాలపై ప్రభుత్వానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఒంగోలుకు చెందిన డీసీసీబీ మాజీ చైర్మన్ ఈదర మోహన్ పలు అంశాలపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. మోహన్ ఫిర్యాదు ఆధారంగా డ్వామాలో శీనారెడ్డి కాలంలో జరిగిన అక్రమాలపై విచారణ చేయాలని జిల్లా మంత్రి డాక్టర్ స్వామి సంబంధిత శాఖ మంత్రి అయిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను గతంలోనే కోరారు.

సీఎం ఫిర్యాదు చేసిన దామచర్ల

అలాగే ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఏకంగా సీఎం చంద్రబాబునాయుడుకు శీనారెడ్డి అవినీతి, అక్రమాలపై ఫిర్యాదు చేశారు. మరోవైపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి దృష్టికి కూడా ఈదర మోహన్ తీసుకెళ్లడంతో ఆమె కూడా ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ ఫిర్యాదులుపై విజిలెన్సు విచారణకు ఆదేశించారు. ప్రస్తుతం అది కొనసాగుతోంది. ఇక పొదిలికి చెందిన మహిళా న్యాయవాది ఒకరు శీనారెడ్డి పై లోకాయుక్తలో ఫిర్యాదు చేయగా ప్రస్తుతం విచారణకు వచ్చింది. అలాగే మరో నలుగురైదుగురు ఇతర వ్యక్తులు, డ్వామాలోని కొందరు ఉద్యోగులు కూడా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పలువురు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు కూడా శీనారెడ్డి వ్యవహారాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టిలో పెట్టారు.

సమగ్ర విచారణకు ఆదేశం

ఈ నేపథ్యంలో శీనారెడ్డి కాలంలో డ్వామాలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని నాలుగురోజుల క్రితం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారుల నుంచి లేఖ వచ్చింది. దీనిపై స్పందించిన కలెక్టర్ విచారణ కోసం కమిటీని నియమించారు. ఇటీవల డీఎల్‌డీవో ఉషారాణి, అలాగే పీడీసీసీ బ్యాంకులో అవకతవకలపై సమగ్ర విచారణ నిర్వహించిన డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావుకు ఆ బాధ్యత అప్పగించారు. ఆయన నేతృత్వంలో మరో ఇద్దరు సీనియర్ అధికారులతో కూడిన త్రిసభ్య కమిటీని విచారణ కోసం నియమించారు. ఒకటి రెండు రోజుల్లో ఈ కమిటీ విచారణ చేపట్టనున్నట్లు సమాచారం.



సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న పీఆర్ ఏఈ, టీడీపీ నాయకులు

రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

చినగంజాం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సిమెంట్ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యతాప్రమాణాలను పాటించాలని పంచాయతీరాజ్ ఏఈ డి.దాసు అన్నారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని అంబేద్కర్‌నగర్, సోపిరాల గ్రామాల్లో నూతనంగా నిర్మించే సిమెంట్ రోడ్లకు బుధవారం పూజా కార్యక్రమాలను నిర్వహించి, పనులను ప్రారంభించారు. సోపిరాల గ్రామంలో రూ.26.50 లక్షలతో, అంబేద్కర్‌నగర్‌లో రూ.10లక్షలతో సిమెంట్ రోడ్లను నిర్మిస్తున్నట్లు ఏఈ తెలిపారు. వంద శాతం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో రోడ్ల నిర్మాణాలను చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు చెరుకూరి రాఘవయ్య, నాయకులు సందు శ్రీనివాసరావు, పర్వత రెడ్డి పార్థసారిధి, ఏసోబు, గుత్తేదారుడు ధర్మవరపు ఏసునారాయణ పాల్గొన్నారు.

అద్దంకి పాలిటెక్నిక్‌లో రేపు జాబ్ మేళా

అద్దంకిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన అద్దంకి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్, కళాశాల ప్రిన్సిపాల్ సాహిల్ బాబు బుధవారం ప్రకటన ద్వారా తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఐసీఐసీ బ్యాంక్, ఏయూ బ్యాంక్, ఆపోలో టైర్స్, ఇలాగిరి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు హాజరవుతాయని, 100కు పైగా ఖాళీలు ఉన్నాయని తెలిపారు. జీతం విద్యా అర్హతను బట్టి 10వేల నుంచి 20వేల వరకు ఉంటుందని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, బీఎస్సీ, ఎంఎస్‌సీ (కెమిస్ట్రీ), ఎంబీఏ, పీజీ విభాగాలు చదువుకున్న 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతీయువకులు వారి బయోడేటాతో, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్, ఆధార్, పాస్‌ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9542970871ని సంప్రదించాలని తెలిపారు.

శ్మశానవాటికలో చేతిపంపు ఏర్పాటు



చేతి పంపును ప్రారంభించిన కాలనీవాసులు

మార్టూరు, నవంబరు 27 : (ఆంధ్రజ్యోతి : గ్రామ పంచాయతీలో ఎస్సీకాలనీకి చెందిన శ్మశానవాటికలో చేతిపంపును ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాలు మేరకు పంచాయతీ నిధులతో చేతిపంపును ఏర్పాటుచేశారు. బుధవారం గ్రామ పెద్దలు, టీడీపీ కార్యకర్తలు చేతిపంపును ప్రారంభించారు కార్యక్రమంలో గొట్టిపాటి వెంకట్రావు, నాగండ్ల తిరుమలరావు, మందపాటి అంజయ్య, ముక్తిపాటి సాయిబాబా పాల్గొన్నారు.

పెద్దఖానా వద్ద మొబైల్ టాయ్‌లెట్ల ఏర్పాటు



ఎక్స్‌కవేటర్‌తో ఏర్పాటు చేస్తున్న మొబైల్ టాయ్‌లెట్

మార్టూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు సెంటర్లో పెద్ద ఖానా వద్ద మొబైల్ టాయ్‌లెట్లను ఏర్పాటు చేశారు. పెద్ద క్రేన్ సహాయంతో గతంలో హైదరాబాద్‌లోని ఒక కంపెనీ నుంచి తీసుకువచ్చిన 6 మొబైల్ టాయ్‌లెట్‌లను పెద్దఖానా వద్ద ఏర్పాటు చేశారు. పురుషులకు 3, మహిళలకు 3 టాయ్‌లెట్లను పంచాయతీ నిధులు రూ.10లక్షలతో తీసుకొచ్చారు. పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు మొబైల్ టాయ్‌లెట్‌ల ఏర్పాటుకు పనులు చేయించారు. మరో వారంలో వాటిని ప్రారంభిస్తారని నాయకులు తెలిపారు.



ఆరికట్లవారిపాలెం, చందలూరు గ్రామాల మధ్య నడిమి వాగు పై కూలిన వంతెన



చిల్లకంప, చెట్లతో ఛిద్రమైన ఆరికట్లవారిపాలెం చందలూరు రహదారి

వంతెన పునర్నిర్మాణం ఎప్పుడో?

- నడిమి వాగుపై కూలిన వైనం
- ఏళ్లుగా నిరీక్షణ
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న రైతులు, కూలీలు

పంగులూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నడిమి వాగుపై వంతెన కూలడంతో రాకపోకలు సాగించలేక ఆరికట్లవారిపాలెం గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. వంతెన కూలి ఏళ్లు గడుస్తున్నా పునర్ నిర్మాణానికి నోచుకోలేదని గ్రామ రైతులు, మహిళలు వాపోతున్నారు. మండలంలోని ఆరికట్లవారిపాలెం, చందలూరు గ్రామాల మధ్య కొన్నేళ్ల కిందట తుఫాన్‌తో తలెత్తిన వరద తాకిడికి నడిమి వాగుపై వంతెన కూలిపోయింది. వంతెన కూలడంతో నడిమి వాగుకు అవతలి వైపు ఉన్న పొలాల్లో పంట సాగుకు ఆరికట్లవారిపాలెం రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వంతెన ఉన్న సమయంలో కూత వేటు దూరంలో పొలాలకు చేరుకునే రైతులు వంతెన కూలి వాగుకు పెద్ద గండి పడడంతో ఏడెనిమిది కిలోమీటర్ల దూరం తిరిగి వెళ్లాల్సిన పరి పరిస్థితి ఏర్పడింది. నిత్యం పొలం పనులకు వెళ్లే రైతులు, వ్యవసాయ కూలీలు వాగుపై వంతె కూలడంతో ఏర్పడిన గండిని దాటి పొలాలకు చేరుకోవడం నరక ప్రాయంగా ఉందని వాపోతున్నారు. చందలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో వ్యవసాయ రుణాల కోసం రైతులు, కెనరా బ్యాంక్‌లో కార్యకలాపాల కోసం రాకపోకలు సాగించే పొదుపు సంఘాల మహిళలు చందలూరు చేరుకోవాలంటే పంగులూరు వైపుగా తిరిగి వెళ్లడానికి సరైన వసతి లేక యిబ్బంది పడుతున్నారు. నడిమి వాగుపై వంతెన పునర్ నిర్మించడంతో పాటు చందలూరు, ఆరికట్లవారిపాలెం గ్రామాల మధ్య చిల్ల కంప తొలగించి రోడ్డుకు తగిన మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గోమాతల రక్షణ అందరి బాధ్యత

- శ్రీశైల దేవస్థానానికి రూ1,02,516 అందజేత

చీరాలటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గోవుల సంరక్షణ అందరి బాధ్యత అని చీరాల శ్రీభ్రమరాంబికా సేవా సమితి చీరాల ప్రతినిధులు అన్నారు. శ్రీశైల దేవస్థానానికి గో సంరక్షణలో భాగంగా గ్రాసం నిమిత్తం రూ.1,02,516ను దేవస్థానం ఈవో చంద్రశేఖర్ ఆజాద్‌ను కలిసి అందజేశారు. అంతేకాకుండా రూ.1.50లక్షల విలువైన 21 గరుకు స్తంభాలను కాళహస్తి గోశాలకు, గో సంచార ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోమాతలతో పుణ్య కార్యాలు నిర్వహించేటప్పుడు గరుకు స్తంభాలకు వాటితో అదుపు చేసి నిర్వహించేందుకు వెసులుబాటు ఉం టుందనిచెప్పారు. ఈవో సమితి ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ఎంవీఎస్ మహాలక్ష్మి, సెక్రటరీ అబ్బరాజు శ్రీనివాస్‌కుమార్, కో-ఆర్డినేటర్స్, సేవకులు పాల్గొన్నారు.



గరుకు స్తంభాల వద్ద ఆవులకు పూజలు నిర్వహిస్తున్న ప్రతినిధులు



ప్రిన్సిపాల్ శేషకుమారిని సన్మానిస్తున్న సిబ్బంది

ప్రిన్సిపాల్ శేషకుమారికి సన్మానం

పర్చూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అధ్యాపకురాలిగా పురస్కారం అందుకున్న పర్చూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శేషకుమారిని బుధవారం బీఏఆర్ అండ్ టీపీ జూనియర్ కళాశాలలోని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఘనంగా సన్మానించారు. జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ ద్వారా ఆమె అవార్డును అందుకున్నారు. ఈసందర్భంగా కళాశాల సిబ్బంది పూలమాలలు దుశ్శాలువాలతో శేషకుమారిని సత్కరించారు. కార్యక్రమంలో రవి కుమార్, బాబూరావు, దీప, ధనలక్ష్మి, కొల్లా హనుమంతురావు, శేషగిరి తదితరులు ఉన్నారు.

'మక్కెనవారిపాలెం చెరువు'కు వేలం

సంతమాగులూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మక్కనవారిపాలెం గ్రామంలో 24-25,-26 సంవత్సరానికి సంబంధించి చేపల పెంపకానికి చెరువు వేలం పాటను బుధవారం పంచాయతీ కార్యాలయంలో ఈవోపీఆర్డీ శివకృష్ణ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రభుత్వ పాటగా రూ.లక్షా39,000వేల నుంచి ప్రా రంభంకాగా ముగ్గురు పాల్గొన్నారు. మక్కెనవారిపాలెం గ్రామానికి చెందిన నాగుపోతు కొండలు రూ.1,45,000 పాడి క్రైవసం చేసుకున్నారు. సుమారు ఈ చెరువు 8 ఎకరాల 83 సెంట్ల విస్తీర్ణంలో ఉందని కార్యదర్శి నాగార్జున తెలిపారు.

పూల సాగు రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం



పంగులూరులో రైతులకు సూచనలిస్తున్న మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు

అద్దంకిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పూలు సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ఉద్యాన శాఖ అధికారి ఎస్.దీప్తి అన్నారు. బుధవారం మండలంలోని ధేనువకొండ, గోపాలపురం గ్రామాలల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా దీప్తి మాట్లాడుతూ బంతి, చామంతి, రోజా, మల్లె, సంపంగి పూల సాగుకు ఎకరాకు రూ.6400 ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. ఉద్యాన పంటలలో మల్చింగ్ పేపర్ వేసుకునేందుకు హెక్టారుకు రూ.16వేలు అందిస్తుందని తెలిపారు. 5ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు 90శాతం రాయితీపై బిందు సేద్యం పరికరాలు రాయితీపై అందిస్తుందని రైతులు సద్వినియోగపర్చుకోవాలని తెలిపారు. రబీ ఈ పంట నమోదు ప్రారంభం అయిందని రబీలో పంటలు సాగు చేసిన రైతులు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. కారక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ నాగినేని రామకృష్ణ, అన్నబత్తిన అజయ్ బాబు, యర్రా నరసింహారావు, గ్రామ వ్యవసాయ సహాయకులు వీ రేష్, మార్కెట్ కమిటీ అసిస్టెంట్ బాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులు పాటించాలి

పంగులూరు : రైతులు సాగు విధానంలో ఆధునిక పద్ధతులు పాటించాలని మార్టూరు వ్యవసాయ సహాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పంగులూరు, మల్లవరం గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏడీఏ రైతులతో కలసి వరి, శనగను పరిశీలించారు. సాగులో సాంకేతిక పద్ధతులు అవలంబించడం ద్వారా అతి తక్కువ ఖర్చుతో అధిక ఫలసాయం సాధించే అవకాశం ఉందన్నారు. రైతులు సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. భాస్వరం ఎరువు ఆఖరి దుక్కిలోనే వేయాలన్నారు. వ్యవసాయాధికారుల సూచనలను అనుసరించి రసాయణ ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగంతో పాటు ప్రకృతిలో లభించే ఆకులు, అలములతో తయారు చేసుకనే జీవామృతం వంటి కషాయాలు పైరుపై పిచికారీ చేసి తెగుళ్లు, పురుగులు నివారించాలన్నారు. రబీలో సాగు చేసిన పంటలకు సంబంధించి శనగకు ఎకరాకు రూ.54, మొక్కజొన్నకు రూ.105, వరికి రూ.126 చెల్లించి పంటల బీమా చేయాలని, ప్రతి రైతు సాగు చేసిన పంటలను సేవా కేంద్రాలలో నమోదు చేయించాలని సాంకేతిక వ్యవసాయాధికారి వెంకటరమణ కోరారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది అలగ్జాండర్, నవనీతం పాల్గొన్నారు.

మేదరమెట్ల : శనగ, మొక్కజొన్న, వేసే రైతులు తప్పని సరిగా విత్తన శుద్ధిని చేసుకోవాలని ఏవో పి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మండలంలోని దైవాలరావూరు, బొల్లవరప్పాడు గ్రామాల్లో పొలపిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. కార్యక్రమంలో వీపవో ప్రత్యూష, ఏఎంసీకి చెందిన రమణయ్య పాల్గొన్నారు.

చీరాలటౌన్ : దోమపోటు, ఉల్లికోడు వాటి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో సుమతి పేర్కొన్నారు. మండల పరిధిలోని విజయనగర్ కాలనీ, ఈపూరుపాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వీపీఏలు శ్రావ్య అఫియా, ధీరజ్, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు వేయాలి

దగ్గుబాడు : రైతులు ప్రత్యామ్నాయ పం టలపై రైతులు దృష్టిసారించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్.మోహనరావు అన్నారు. కారంచేడు మండలంలోని దగ్గుబాడు, స్వర్ణపాలెం గ్రామాల్లో బుధవారం ఏవో సుధీర్ ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. దగ్గుబాడు గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడుతూ రబీ సీజన్‌లో వైట్‌బర్లీ పొగాకు సాగుకు ప్రత్యామ్నాయం గా శనగ, మినుం, మొక్కజొన్న పంటలను సాగుచేసుకోవాలని సూచించారు. తద్వారా తక్కువ ఖర్చు, నాణ్యమైన దిగుబడులతోపాటు, భూమి కూడా సారవంతంగా మారుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

పంట బీమాతో ప్రయోజనం

ఇంకొల్లు : రబీలో వేసిన పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో ఇన్స్యూరెన్స్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి వేణుగోపాల్ సూచించారు. మండలంలోని ఇడుపులపాడులో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో బత్తిని సింగయ్య

రేపటి నుంచి సర్వే

సన్న, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వివరాల సేకరణ

అద్దంకిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో ఈనెల 29వ తేదీ నుంచి చిన్న, సన్న, మధ్య తరహా పరిశ్రమల సర్వే జరుగుతుందని, సచివాలయ ఉద్యోగులు దీనిపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో బత్తిని సింగయ్య తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ హాలులో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు సర్వేపై శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొన్నారు. ఈ సర్వే ద్వారా పరిశ్రమల ప్రస్తుత స్థితిగతులు తెలుసుకోవడం వాటి అభివృద్ధికి అవసరమైన ప్రభుత్వ విధానాల రూపకల్పనకు ఉపయోగించుకోవడం కోసం, వారికి అవసరమైన శిక్షణ, ఇతర సదుపాయాల కల్పన కోసం సర్వే ద్వారా వచ్చిన వివరాలను ఉపయోగించుకోవడం జరుగుతుందన్నారు. మండలంలోని పరిశ్రమల యజమానులు అందరూ సర్వే సిబ్బందికి సహకరించి అవసరమైన సమాచారం అందించాలని కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉదయం సచివాలయ సిబ్బందికి పరిశ్రమల సర్వేపై శిక్షణ ఇ వ్వడం జరుగుతుందని ఎంపీడీవో సింగయ్య తెలిపారు.

వైద్యశాలలో డెలివరీపై కౌన్సెలింగ్

బల్లికురువ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు సిపాయి కాలనీకి చెందిన నిండు గర్భిణికి వైద్యశాలలో చికిత్స చేయించుకోకుండా ఇంటికి రావడంతో బుధవారం బల్లికురవ ఎస్ఐ జీవీ చౌదరి, వైద్య సిబ్బందితో కలిసి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ఆమెకు రక్తహీనత ఉండడంతో ఈ నెల 4వ తేదీన వైద్య సిబ్బంది ఆమెను ఒంగోలు రిమ్స్‌కు డెలివరీ కోసం పంపించారు. ఆమె అక్కడ ఉండడంతో భర్త ఒంగోలు వెళ్లి డెలివరీ అక్కడ చేసేది ఏంటీ అని స్వగ్రామం తీసుకువచ్చారు. ఈ విషయాన్ని గర్భిణి పరిస్థితిని పోలీసుకు వైద్య సిబ్బంది తెలియజేశారు. దీంతో ఎస్సై యువతి ఇంటికి వెళ్లి ఆమె వైద్యశాలలోనే డెలివరీ చేయించుకునేలా భర్తకు కౌన్సెలింగ్ ఇచ్చి తిరిగి వైద్యశాలకు వెళ్లేలా చేశారు. దీంతో గర్భిణిని 104లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

నేడు పాఠశాలల హెచ్ఎంలకు సమావేశం

అద్దంకిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలకు గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం జరుగుతుందని ఎంపీడీవో సింగయ్య తెలిపారు. ఈ సమావేశానికి మండల స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ హాజరవుతారని, ప్రధానోపాధ్యాయులందరూ విధిగా హాజరు కావాలని, ఎవరికీ మినహాయింపు లేదన్నారు. కాగా సింగిల్ టీచర్స్ ఉన్న పాఠశాలల హెచ్ఎంలు సమావేశానికి హాజరు కావాల్సిన అ వసరం లేదని తెలిపారు. డిసెంబరు 7వ తేదీన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రత్యేక సమావేశం ఉన్నందున దానికి సన్నాహక సమావేశం గురువారం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఒకటి నుంచి క్రిస్మస్ క్యారల్స్

చినగంజాం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని డిసెంబరు 1వ తేదీ నుంచి చినగంజాంలో క్రిస్మస్ క్యారల్స్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మేకల మేషక్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్‌నగర్ గ్రామ పెద్దలు, ఎంప్లాయిస్ అసోసియేషన్, అంబేద్కర్ యూత్ సభ్యుల సహాయ సహకారాలతో క్రిస్మస్ క్యారల్స్‌ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సండే స్కూల్ చిన్నారులు, యువతీ యువకులతో డిసెంబరు 1వ తేదీ నుంచి తెల్లవారుజాము 4గంటల నుంచి 6గంటల వరకు జరిగే క్రిస్మస్ క్యారల్స్ కార్యక్రమాన్ని డిసెంబరు 25వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ క్యారల్స్ కార్యక్రమంలో చిన్నారులు, యువతీ యువకులు, పెద్దలు పాల్గొని విజయవంతం చేయాలని మేషక్‌బాబు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేటపాలెం (చీరాల), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సబ్ స్టేషన్‌లో నూతన పరికరాలను ఏర్పాటు చేయుటకు గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ బుధవారం తెలిపారు. దేశాయిపేట, ఆమోదగిరి పట్నం, నీలకంఠపురం, సిలోన్‌కాలనీ, వ్యవసాయ మార్కెట్ యార్డ్, ఐటీఐ కాలనీ, రామనగర్, మంకెనవారిపాలెం, చిన్నబజార్, లైబ్రరీ రోడ్డు, రెడ్ల బజారు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

పాఠశాలకు కుర్చీలు అందజేత



హెచ్ఎంకు కుర్చీలు, ఇతర సామగ్రిని అందజేస్తున్న సభ్యులు

అద్దంకిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలకు కుర్చీలు, ఇతర అవసరమైన సామగ్రిని అందజేశారు. అళహరి వెంకట సుబ్బమ్మ జ్ఞాపకార్థం ఆ మె కుమారులు రోటరీ సభ్యులు హరిప్రసాద్ సౌజన్యంతో పట్టణంలోని గాజులపాలెం ప్రాథమిక పాఠశాలకు కుర్చీలు, స్టీల్ వాటర్ క్యాన్, హ్యాండ్ వాష్ బాటిల్స్‌ను పాఠశాల హెచ్ఎం కర్నాటి నాగమణికి అందజేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, నందిరెడ్డి శ్రీనివాసరావు, జ్యోతి చంద్రమౌళి, చిన్ని మురళి కృష్ణ, కామేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలించిన డీఎస్పీ

మార్టూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వార్షిక తనిఖీలలో భాగంగా బుధవారం మార్టూరు పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ జీ రామాంజనేయులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పలు కేసులకు సంబంధించిన వివరాలను సీఐ ఎం.శేషగిరిరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు రికార్డులను డీఎస్పీ పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వాటిలో కొన్నింటికి సంబంధించి ఆయన పలు సూచనలు చేశారు. ఇంకా మండలంలో పలు విషయాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ ప్రాంగణంలో డీఎస్పీ కొబ్బరి మొక్కలను నాటారు. తొలుత స్టేషన్‌కు విచ్చేసిన డీఎస్పీకి సీఐ శేషగిరిరావు, సంతమాగులూరు సీఐ వెంకట్రావు, బల్లికురవ ఎస్ఐ జీవీఎస్ చౌదరి, ఎస్ఐ సైదా, ఆధ్వర్యంలో ఏఎస్ఐ బాషాలు, పోలీసు సిబ్బంది గౌరవపూర్వకంగా స్వాగతం పలికారు.

మద్యం అక్రమ విక్రయదారుడి అరెస్ట్

చీరాలటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం నిల్వచేసి విక్రయిస్తున్న వాడరేవుకు చెందిన వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద 12మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. సిఐ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో తరచుగా దాడులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నేరస్థులు తీరు మార్చుకోకుంటే శిక్షలు తప్పవన్నారు.